

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని ఉస్కో అంటే.. మున్సిపల్ అధికారగణం డిస్కో అన్నారంట. పాత మున్సిపల్ కార్యాలయం వాడకం అంశంలో నాని అడుగడుగునా నిబంధనలకు పాతరేసినా రిటర్నింగ్ అధికారి పద్మావతి మొదలు మున్సిపల్ అధికారుల వరకు మిన్నకుండిపోయి అయ్యవారి అడుగులకు మడుగులొత్తారు. టీడీపీ నాయకులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా నోటీసుతో మమ.. అనిపించారు. కానీ, నిజాలు దాచాలంటే దాగిపోతాయా..? ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.



కొడాలి.. అండ్ కో..

క్యాంపు కార్యాలయం విషయంలో అన్నీ ఉల్లంఘనలే..

తెలిసి కూడా ఏకపక్షంగా వ్యవహరించిన అధికారులు

- కొడాలి నాని సేవలో తరిస్తున్న ఆర్వో, ఇతర అధికారగణం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఆర్వో.. నిజాలు దాచేసిన గుడివాడ మున్సిపల్ అధికారులు
- కౌన్సిల్ ఆమోదం లేకుండానే కార్యాలయం హస్తగతం
- వేలం నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా వాడకం
- ఏడు నెలలకు పైసా అద్దె చెల్లించలేదు..!

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/గుడివాడ) : గుడివాడ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులో కొంత ప్రాంతాన్ని కొడాలి నాని తన క్యాంప్ ఆఫీసుగా వాడుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చాక.. మున్సిపల్ కమిషనర్ నోటీసు ఇవ్వడంతో ఖాళీ చేశారు. అయితే, నామినేషన్‌లో తాను ప్రభుత్వ వసతి ఉపయోగించుకోలేదని నాని పేర్కొనడం నిబంధనలకు విరుద్ధమంటూ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీనిపై రిటర్నింగ్ అధికారి కనీస స్పందన చూపలేదు. ఈ విషయంలో కొడాలి నాని పక్కాగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని స్పష్టమైనా ఒక్క అధికారికి కూడా ఇది తప్పని చెప్పే ధైర్యం లేకుండాపోయింది. ఇవి నిబంధనలను ఉల్లంఘించడం కాదా..?

● వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానిని మంత్రి పదవి వరించింది. 2019, జూన్ 8న మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. మంత్రి క్యాంపు కార్యాలయం కోసం పరిశీలన జరుగుతున్న సమయంలో ఆయన కన్ను పాత మున్సిపల్ కార్యాలయంపై పడింది. కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఆ భవనాన్ని తన స్వాధీనంలోకి తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మున్సిపాలిటీకి వచ్చిన అభివృద్ధి నిధులు సుమారు రూ.3 కోట్లతో పాత భవనానికి మరమ్మతులు చేయించారు. 2019, నవంబరులో ఆ భవనంలోకి ప్రవేశించారు. సాధారణంగా మున్సిపల్ షాపులు ఎలాంటి స్థితిలో ఉన్నా వాటిని బహిరంగ వేలం ద్వారానే లీజుదారులకు అప్పగించాలి. ఎటువంటి మరమ్మతులు ఉన్నా లీజుదారుడే తన సొంత ఖర్చుతో చేయించుకోవాలి. అన్ని డిపాజిట్లు కట్టాకే షాపులు అప్పగిస్తారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా అమల్లో ఉన్న మున్సిపల్ నిబంధనలు. కానీ, ఎమ్మెల్యే నాని విషయంలో మాత్రం అవి అమలుకాలేదు. మున్సిపాలిటీ సొమ్ముతో మరమ్మతులు చేసి మరీ భవనాన్ని ఆయనకు అప్పగించారు. 2019, నవంబరులో పౌరసరఫరాల శాఖతో మున్సిపాలిటీ వారు మూడేళ్ల కాలానికి లీజు ఒప్పందం చేసుకున్నారు. ఇది అధికార దుర్వినియోగం కాదా..?.

● పౌరసరఫరాల శాఖతో మున్సిపాలిటీ ఒప్పందం 2022, నవంబరు 30న ముగిసింది. నాటి నుంచి 2023, జూలై వరకు ఏడు నెలలు పాటు ఎమ్మెల్యే నాని ఆక్రమణలోనే పాత మున్సిపల్ భవనంలోని పై అంతస్తు ఉంది. ఈ కాలానికి ఎలాంటి అద్దె చెల్లించకుండా ఉచితంగా ప్రభుత్వ భవనాన్ని నాని ఉపయోగించుకున్నారు. 2023, జూలై 10న మళ్లీ నాని పేరుతో మున్సిపల్ శాఖ ఒప్పందం చేసుకుంది. 2025, నవంబరు వరకు ఆయన పేరుతో లీజుకు ఇచ్చినట్టు అందులో పేర్కొన్నారు. అదేరోజు మున్సిపల్ కౌన్సిల్‌లో హడావిడిగా తీర్మానం కూడా చేసేశారు. మరోసారి ఎలాంటి బహిరంగ వేలం లేకుండానే నాని పేరుతో ఒప్పందం జరిగిపోయింది. ప్రజాప్రతినిధి పేరున ప్రభుత్వ భవనాలను అద్దెకు తీసుకోవడం, అద్దె కట్టకుండా తన ఆధీనంలో ఉంచుకోవడం అధికార దుర్వినియోగం కాదా....?



నామినేషన్‌లో కొడాలి నాని తప్పులను ఆధారాలతో సహా ముందే బయటపెట్టిన టీడీపీ నేతలు (ఫైల్)

● పౌరసరఫరాల శాఖ నుంచి ఎమ్మెల్యే నాని పేరిట.. పాత మున్సిపల్ కార్యాలయ భవనాన్ని మార్చే క్రమంలో వచ్చిన విద్యుత్ బిల్లులను మున్సిపాలిటీకి చెల్లించినట్టు అధికారులు పేర్కొంటున్నారు. నాని తన అనుచరగణం వాడుకున్న విద్యుత్ బిల్లును మున్సిపాలిటీతో కట్టించడం అధికార దుర్వినియోగం కాదా...?

● గుడివాడకు చెందిన భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకుడు వైవీ మురళీకృష్ణ సమాచార హక్కు చట్టం ద్వారా పాత మున్సిపల్ భవనం లీజు వివరాలను అడిగారు. పౌరసరఫరాల శాఖ పూర్తిస్థాయిలో అద్దెను చెల్లించలేదని, ఏడు నెలల పాటు ఎమ్మెల్యే కొడాలి నాని ఆధీనంలో భవనం ఉన్నట్టు సమాచారమిచ్చారు. 2023, జూలైలో నానీకి భవనం ఇవ్వగా, డిసెంబరు నుంచి అద్దె వసూలు చేస్తున్నట్టు అధికారులు సమాచారం ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక 2024, మార్చి 17న మున్సిపల్ అధికారులు సదరు భవనాన్ని స్వాధీనం చేసుకున్నారు. భవనాన్ని స్వాధీనం చేసుకునే నాటికి 23 నెలలుగా అద్దె చెల్లించలేదని తెలిపారు. మూడు నెలలు అద్దె కట్టకుంటేనే డిఫాల్టర్‌గా పేర్కొనే మున్సిపల్ అధికారులు 23 నెలల పాటు అద్దె చెల్లించకుంటే ఎందుకు మిన్నకుండిపోయారు. దీన్ని అధికార దుర్వినియోగం కాక ఏమంటారు?

● 2024, మార్చి 17న.. మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే కొడాలి నాని ఆధీనంలో ఉన్న పాత మున్సిపల్ భవనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు రిటర్నింగ్ అధికారికి సమాచారమిచ్చారు. అయితే, మార్చిలో వరుసగా 19, 20, 21, 22, 23, 26 తేదీల్లో రోజుకు రూ.2 లక్షల చొప్పున, మార్చి 27న మిగిలిన రూ.1,14,240 అద్దె బకాయి చెల్లించినట్టు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. నామినేషన్ విషయంలో తలనొప్పులు వస్తాయన్న ఉద్దేశంతోనే ఈ అద్దెలు చెల్లించినట్టు తెలుస్తోంది. అంతకుముందు జరిగిన ఉల్లంఘనలన్నీ ఈ రూపేణా మాఫీ అయిపోతాయని నాని భావించి ఉండటం అధికార దుర్వినియోగం కాదా?

అద్దె బకాయిలు చెల్లించిందెప్పుడు..?

- ఈనెల 26 తర్వాత చెల్లించారని అనుమానాలు
- పాత తేదీలతో చూపేందుకే మాన్యువల్ రశీదులు

అద్దె బకాయి చెల్లింపు విషయంలో మున్సిపల్ ఉద్యోగుల్లోనే భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. నామినేషన్ల ప్రక్రియ పూర్తై ఈనెల 26న నామినేషన్ల పరిశీలన సమయంలో టీడీపీ నాయకులు పాత మున్సిపల్ భవనం అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఈ మేరకు ఆర్వోకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భవనాన్ని వాడుకున్న విషయాన్ని నామినేషన్‌లో తెలపలేదని కూడా పేర్కొన్నారు. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్తంగా రచ్చ జరగడంతో కొడాలి అండ్ కో అప్రమత్తమైంది. ఆ భవనానికి 23 నెలల అద్దె బకాయిలు ఉన్నట్టు తేలడంతో నాని అనుచరుడొకరు అదేరోజు రాత్రి అంటే.. 26వ తేదీ చెల్లించినట్టు కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. బాగోతం బయటపడకుండా ఉండేందుకు ఆన్‌లైన్ ద్వారా కాకుండా మాన్యువల్ విధానంలో నగదు చెల్లింపులు చేసినట్టు చూపారు. ఇలా చేయడం ద్వారా పాత తేదీలతో రశీదులను సృష్టించారు. పాత తేదీతోనే నో డ్యూ సర్టిఫికెట్‌ను తీసుకుని ఆర్వోకు సమర్పించారు. ఈ వ్యవహారంపై పక్కా విచారణ జరిపితే నాని పోటీకే అనర్హుడిగా తేలిపోతారని మున్సిపల్ సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు.

జయహో.. జ్యోతి సురేఖ

ప్రపంచకప్ ఆర్చరీలో జ్యోతి సురేఖ హ్యాట్రిక్ స్వర్ణాలు

- నగర ఆర్చర్‌కు ఘనంగా స్వాగతం
- అభినందించిన ప్రభుత్వ క్రీడల ప్రధాన కార్యదర్శి



జ్యోతి సురేఖను అభినందిస్తున్న ప్రభుత్వ క్రీడల ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న

విజయవాడ స్పోర్ట్సు/గన్నవరం, ఏప్రిల్ 30 : షాంఘైలో ఇటీవల జరిగిన ప్రపంచకప్ స్టేజ్-1 ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో హ్యాట్రిక్ స్వర్ణాలతో సత్తా చాటిన యువ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖకు అభినందనలు వెల్లువెత్తాయి. స్థానిక శాప్ ప్రధాన కార్యాలయంలో ప్రభుత్వ క్రీడల ప్రధాన కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న మంగళవారం ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాప్ పరిపాలనాధికారి పి.రామకృష్ణ, జ్యోతి సురేఖ తండ్రి వెన్నం సురేంద్ర పాల్గొన్నారు. కాగా, అంతకుముందుకు గన్నవరం విమానాశ్రయానికి విచ్చేసిన జ్యోతి సురేఖకు ఘనస్వాగతం లభించింది. ఢిల్లీ నుంచి ఎయిరిండియా విమానంలో ఇక్కడికి వచ్చిన జ్యోతి సురేఖకు యూనియన్ బ్యాంక్ విజయవాడ డీజీఎం ఎం.శ్రీధర్, ఏజీఎం బి.హరిశ్, ఏపీ యూనియన్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఆనంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవితేజ, కెనరా బ్యాంక్ ఉద్యోగ సంఘం కార్యదర్శి బి.బాబు తదితరులు ఘనంగా స్వాగతించారు.

ఏమిటీ దారుణం





రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) డాక్టర్ శ్రీనివాస్ నాయక్ మృతదేహం

డాక్టర్ నాయక్ ఆత్మహత్య, కుటుంబ హత్యల వెనుక అనుమానాలు

- అప్పుల కారణంగానే ఈ ఘటనకు ఒడిగట్టారా?
- తన శ్రీజ ఆసుపత్రిని వేరొకరికి ఎందుకిచ్చారు?
- ఆసుపత్రిలో ఏమైనా సమస్యలున్నాయా?
- కుటుంబం తలచుకుంటే తీర్చలేనన్ని అప్పులా?
- మానసిక ఒత్తిడి వల్లేనని వాయిస్ మెసేజ్
- ఈఎంఐలు కట్టలేకపోయాడన్న స్నేహితుడు

అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు

మంచి వైద్యుడు.. మంచి స్నేహితుడు.. పైగా సౌమ్యుడు.. అంతకుమించి కుటుంబాన్ని అమితంగా ప్రేమించే మనిషి. అలాంటి ఓ వ్యక్తి తల్లి, భార్య, కూతురు, కొడుకును దారుణంగా హత్యచేసి, తాను ఆత్మహత్య చేసుకుంటాడా? పటమటలోని ఆర్థోపెడిక్ వైద్యుడు దారావత్ శ్రీనివాస నాయక్ ఆత్మహత్య, ఆయన కుటుంబం హత్యల వెనుక ఇలాంటి ఎన్నో ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఇంట్లో నిద్రపోతున్న భార్య ఉషారాణి, కుమార్తె శైలజ, తల్లి రమణమ్మ, కుమారుడు శ్రీహాన్ మెడ పైభాగంలో ఉన్న నరాలను కోసి దారుణంగా చంపేంత కర్కశత్వం ఆయనలో ఉందా? అసలు ఈ దారుణానికి కారణం అప్పులేనా? లేక ఇంకేమైనా కారణాలున్నాయా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు సాగుతోంది. - విజయవాడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి)

ఆసుపత్రిలో సమస్యలా..?

నూజివీడుకు చెందిన శ్రీనివాస నాయక్ గుంటూరులోని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఆయన తండ్రి జమలయ్య నాయక్ మాజీ పోలీసు అధికారి. విజయవాడలో ఏసీపీగా పనిచేశారు. శ్రీనివాస నాయక్‌కు ఒక అన్నయ్య, ఒక చెల్లెలు ఉన్నారు. అన్నయ్య దుర్గాప్రసాద్ హైదరాబాద్‌లో న్యాయాధికారి. తండ్రి విజయవాడలో పనిచేసినప్పటి నుంచి ఆ కుటుంబం ఇక్కడే స్థిరపడిపోయింది. పటమటలోని ఫన్‌టైమ్స్ క్లబ్ వెనుక వీధిలో అభ్యుదయ జూనియర్ కళాశాలకు పక్కనే శ్రీనివాస నాయక్ సొంతింటిని నిర్మించుకున్నాడు. ఏడాది క్రితం డోర్నకల్ రోడ్డులో శ్రీజ ఆసుపత్రిని ప్రారంభించాడు. ఆ తర్వాత ఆర్థిక ఒడిదొడుకులు పెరగడంతో వేరే వైద్యులకు దీని నిర్వహణను అప్పగించినట్టు తేలింది. మొత్తం ముగ్గురు వైద్యులు శ్రీజను నడపడానికి నాయక్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇందులో 90 శాతం వాటా వారిదని, పదిశాతం వాటా నాయక్‌దని నిర్ణయించుకున్నారు. నాయక్‌కు ఆసుపత్రిలో ఒక చాంబర్ ఇచ్చినట్టు తెలిసింది. ఈనెల 1వ తేదీ నుంచి ఈ ఆసుపత్రి నిర్వహణ కొత్త వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినట్టు సమాచారం. అయితే, రాసుకున్న ఒప్పందం ప్రకారం కాకుండా ఉల్లంఘనలు ఏమైనా జరిగితే వివాదాలు మొదలయ్యాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఆసుపత్రి ఏర్పాటుకు సంబంధించి తీసుకున్న రుణాలకు ఈఎంఐలు చెల్లించడానికి నాయక్ ఇబ్బందులు పడుతున్నాడని, వాటిని చెల్లిస్తామని, నాయక్‌కు సహాయం చేస్తామని ఆసుపత్రి నిర్వహణ తీసుకున్నవారు చెప్పారని స్నేహితుడు డాక్టర్ భగవాన్ తెలిపారు.

కుటుంబ కలహాలా..?

తాను ఆత్మహత్య చేసుకోవడానికి ముందు శ్రీనివాస నాయక్ ఒక లేఖ రాశాడు. అందులో 'దిస్ ఈస్ మై కార్ కీ మేడమ్, ప్లీజ్ గివ్ ఓన్లీ టు శ్రీదుర్గాప్రసాద్ మై బ్రదర్' అని రాశాడు. దానికి ఫోన్ నెంబరు రాసి, జడ్జి ఫ్రం హైదరాబాద్ అని పేర్కొన్నాడు. ఈ లేఖను, కారు తాళాలను ఎదురుగా ఉన్న ఇంటి గేటుకు ఉన్న ఉత్తరాల పెట్టెలో వేసి తిరిగి వెళ్లిపోతుండగా, ఇంటి యజమాని అప్పుడే మేల్కొని గమనించాడు. నాయక్‌ను పిలిచి ఏమిటని ప్రశ్నించాడు. లేఖ, తాళాలు తన అన్నయ్యకు అందజేయాలని, తాను ఇక ఉండనని చెప్పి వెళ్లిపోయాడు. ఆయన మాటల్లోని అర్థాన్ని ఎదురింటి యజమాని గమనించలేకపోయాడు. ఒక బ్యాగ్‌లో కొంత నగదు, బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్‌ను సర్ది కారులో పెట్టాడు. ఆ కారు తాళాల్నే ఎదురింట్లో ఇచ్చాడు. నాయక్‌కు ఇబ్రహీంపట్నం కొండపల్లిలో బంధువులు ఉన్నారు. అత్తమామలు అక్కడే ఉంటారు. ఈ లేఖ, తాళాలను దగ్గర్లోన్ని అత్తమామలకు కాకుండా దూరంగా ఉన్న అన్నయ్యకు అందజేయాలని రాశాడు. దీంతో కుటుంబ కలహాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అన్నదమ్ముల ఇద్దరి మధ్య పెద్దగా సత్సంబంధాలు ఉండవని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే, శ్రీజ ఆసుపత్రిని ప్రారంభించినప్పుడు ఆయన అన్నయ్య ఆ కార్యక్రమానికి హాజరైనట్టు తెలుస్తోంది.



మృతదేహాలను బయటకు తీసుకొస్తూ..

అప్పుల విషయమేమీ తెలియదు : కుటుంబ సభ్యులు

కుటుంబ సభ్యులు నలుగురిని చంపడానికి డాక్టర్ నాయక్ రెండు కత్తులను ఉపయోగించాడు. వాటిని కొనుగోలు చేసిన రశీదు పోలీసులకు లభించింది. గురునానక్ కాలనీలో ఉన్న ఉషోదయ సూపర్ మార్కెట్‌లో వీటిని కొన్నట్టు తేలింది. దీనిప్రకారం ఒక పోలీసు బృందం సూపర్ మార్కెట్‌కు వెళ్లి సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించింది. ఘటన గురించి తెలియగానే శ్రీనివాస నాయక్ సతీమణి ఉషారాణి కుటుంబ సభ్యులు పటమటకు చేరుకున్నారు. ఉషారాణి తండ్రి రామాంజీ కుటుంబం ఇబ్రహీంపట్నం కొండపల్లిలో ఉంటోంది. రామాంజీ హెచ్‌పీసీఎల్ ఉద్యోగం చేసి రిటైరయ్యారు. రామాంజీ కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను చూడగానే కుప్పకూలిపోయారు. ఉషారాణి తల్లి బోరున విలపించారు. రామాంజీని పోలీసులు విచారించగా, కొన్ని విషయాలను వెల్లడించినట్టు తెలిసింది. తన అల్లుడికి ఆర్థిక ఇబ్బందులు ఉన్న విషయం తెలియదని ఆయన చెప్పారు. కొన్నాళ్ల క్రితం ఒక స్థలాన్ని విక్రయించి కొంత నగదు సమకూర్చినట్టు వెల్లడించారు. అప్పులు గురించి చెప్పినట్టయితే మరో స్థలాన్ని విక్రయించి తీర్చేవారమని తెలిసింది.

ఎలక్షన్.. కలెక్షన్..

నామినేషన్ ఉపసంహరణలో బేరసారాలు

- సొమ్ము చేసుకున్న స్వతంత్ర, చిన్న పార్టీల అభ్యర్థులు
- ఒక్కో నామినేషన్ ఉపసంహరణకు రూ.4 లక్షల వరకు..
- పెనమలూరులో ఓ అభ్యర్థి ఏకంగా రూ.10 లక్షలు డిమాండ్
- భార్య పేరిట మరో నామినేషన్.. రూ.10 లక్షలకు బేరం



(ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం) : ఎన్నికలంటే.. కొందరికి అధికారం కోసం ఆరాటం అయితే, మరికొందరికి కాసులు దండుకునేందుకు ప్రధాన మార్గం. ఎన్నికల ముసుగులో, పోటీల నాటకంలో పక్కకొచ్చి బేరాలు సాగించడం, క్యాష్ ముట్టగానే సైడ్ అయిపోవడం ఒక వర్గం నాయకులకు మంచి వ్యాపారం. నామినేషన్ల ఉపసంహరణ జరిగిన సోమవారం చాలాచోట్ల ఇదే సీన్ కనిపించింది. పెనమలూరు నియోజకవర్గానికి చెందిన ఒక అభ్యర్థి తనకు రూ.10 లక్షలు ఇస్తే నామినేషన్ ఉపసంహరించుకుంటానని బేరం పెట్టాడు. కలెక్టరేట్ సమీపానికి వచ్చిన తర్వాత రూ.12 లక్షలు కావాలని, లేకుంటే నామినేషన్ ఉపసంహరించనని మాట మార్చాడు. ఒక ప్రధాన పార్టీకి చెందిన అభ్యర్థి అనుచరులు అతనితో మాట్లాడి రూ.10 లక్షలు ఇచ్చి నామినేషన్ ఉపసంహరింపజేయటం గమనార్హం. ఇదే అభ్యర్థి తన భార్యతో పెనమలూరు నియోజకవర్గంలో నామినేషన్ వేయించి రూ.10 లక్షలు తీసుకుని నామినేషన్ ఉపసంహరించాడనే గుసగుసలు వినిపిస్తున్నాయి. మరో నలుగురైదుగురు అభ్యర్థులు రూ.4 లక్షలు, రూ.5 లక్షలు తీసుకుని తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మచిలీపట్నం నుంచి ఓ అభ్యర్థి తాను నామినేషన్ ఉపసంహరించుకోవాలంటే రూ.12 లక్షలు ఇవ్వాలని, తన బ్యాంకు ఖాతాలో ఈ నగదును జమ చేస్తే వెంటనే వచ్చి నామినేషన్ ఉపసంహరించుకుంటానని తన కుమారుడి ద్వారా ప్రధాన పార్టీల అభ్యర్థులతో ఫోన్‌లో సంప్రదింపులు జరిపారు. అంత నగదు ఇచ్చేదిలేదని చెప్పటంతో అతను నామినేషన్ ఉపసంహరించుకోలేదు.

భారీగా బేరాలు

మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి నామినేషన్ వేసిన ఇండిపెండెంట్, ఇతర పార్టీల అభ్యర్థులు తెరవెనుక బేరాలు సాగించి పెద్దమొత్తంలో నగదు పోగేసుకున్నారు. మచిలీపట్నం పార్లమెంట్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన 10 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థులతో పాటు వివిధ పార్టీలకు చెందినవారు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ప్రధాన పార్టీల అభ్యర్థుల నుంచి వసూలు చేయటం గమనార్హం.

ఆయన ఎమ్మెల్యే అయితే మా ప్రాణాలుంటాయా?

- మురుగు సమస్య పరిష్కరించమన్నందుకే దాడి
- జెడ్పీటీసీ స్థాయికే ప్రాణాలు తీస్తామన్నారు..!
- మైలవరం పంచాయతీ వార్డు సభ్యురాలి భర్త రాంబాబురెడ్డి ఆవేదన



రాంబాబురెడ్డి (ఫైల్)

మైలవరం, ఏప్రిల్ 30 : ఆయనో ప్రజాప్రతినిధి. ప్రజాసమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన జెడ్పీటీసీ. సమస్యలను పరిష్కరించాల్సిన ఆయనే సమస్యను సృష్టించి, ఇదేమని ప్రశ్నించినందుకు దాడి చేయించారు. సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి భర్తనే రక్త మొచ్చేలా తలపై రాడ్డుతో దాడి చేయించారు. హత్యాయత్నం కేసు నమోదు చేయాలని బాధితులు.. పోలీసులను కోరినా న్యాయం జరగలేదు. ఏడాదిగా ఈ కేసు నడుస్తూనే ఉంది. ఈ కేసులో నిందితులు మైలవరం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, ఆయన తమ్ముడు స్వామి కాగా, బాధితుడు అలవాల రాంబాబు రెడ్డి. ఏడాది కిందట తనపై జరిగిన హత్యాయత్నం కేసును రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు ఎందుకు తొక్కిపెడుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

'మైలవరం పట్టణ పంచాయతీ 16వ వార్డు సభ్యురాలిగా నా భార్య పద్మావతి ఉంది. వార్డు పరిధిలోని సుగాలి కాలనీలో ఎస్టీలు వాడుకున్న నీరు బయటకు పోకుండా సర్నాల తిరుపతిరావు సోదరుడు స్వామి డ్రెయినేజీకి ఉన్న తూములు మూసేస్తూ చప్టా నిర్మించుకున్నారు. దీంతో మురుగు నీరు డ్రెయినేజీలో నిల్వ ఉండి దోమల బెడద, దుర్వాసన విపరీతంగా వస్తుండటంతో స్థానికులు వార్డు సభ్యురాలి దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ పెద్దల వద్ద పంచాయతీ పెట్టించగా, సర్నాల తిరుపతిరావు, అతని సోదరుడు స్వామి వచ్చారు. ఈ క్రమంలో అకారణంగా నా కుమారుడు గణేశ్ రెడ్డిపై స్వామి దాడికి దిగారు. గణేశ్ గొంతు నొక్కుతుండగా, వదలమని అడ్డుపడిన నాపై ఇనుపరాడ్డుతో దాడి చేసి తల పగలగొట్టారు. తీవ్ర రక్తస్రావమై ఆసుపత్రిలో వారం పాటు చికిత్స పొందాను. అప్పట్లో కేసు పెట్టగా సర్నాల స్వామి, తిరుపతిరావు, కేశవరావుపై ఐపీసీ 324, 323, 506, ఆర్‌డబ్ల్యూ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత రాజకీయ ఒత్తిళ్లతో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ ఘటన జరిగి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు నాకు న్యాయం చేయలేకపోయారు. మైలవరం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు జెడ్పీటీసీగా ఉన్న సమయంలోనే ఇంత అరాచకాలు సృష్టిస్తే ఎమ్మెల్యే అయితే నియోజకవర్గంలో ఎవరినీ బతకనివ్వరు. మా ప్రాణాలు కూడా తీసేస్తారు.' అంటూ రాంబాబురెడ్డి కన్నీటిపర్యంతమయ్యారు.



హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మకు రూ.1.91 కోట్లకు పైగా కానుకలు

వన్‌టౌన్, ఏప్రిల్ 30 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో మంగళవారం 15 రోజుల వ్యవధికి సంబంధించి ఆలయ మహామండపం ఆరో అంతస్తులో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించారు. రూ.1,91,27,261ల నగదు, 370 గ్రాముల బంగారం, 3కిలోల 850 గ్రాముల వెండి కానుకల రూపేణా సమకూరాయి. వీటితో పాటు యూఎస్‌ఏ డాలర్లు 516, ఓమన్ బైంసాలు 100, యూకే పౌండ్లు 80, ఇంగ్లాడ్ పౌండ్లు 40, ఆస్ట్రేలియా డాలర్లు 100, కెనడా డాలర్లు 15, 5 యూరోలు, 2 సింగపూర్ డాలర్లు, 25 యునైటెడ్ అరబ్ ఎమరేట్స్ దిర్హమ్స్, ఒక కువైట్ దినార్, 24 ఖతార్ రియాల్స్, 1000 కొరియా వాన్‌లు వచ్చాయి. ఆన్‌లైన్ ఈ-హుండీ ద్వారా రూ.44,831లు కానుకగా వచ్చాయి. ఈవో కేఎస్ రామారావుతో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది, ఎస్‌పీఎఫ్, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, భవానీ సేవాదారులు తదితరులు కానుకల లెక్కింపులో పాల్గొన్నారు.

అన్నివర్గాలను సంతృప్త పరిచేలా మేనిఫెస్టో



▸ నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 30 : జగన్ అరాచక, విధ్వంసక, సైకో పాలనతో తీవ్ర గాయాల పాలైన రాష్ట్రానికి టీడీపీ కూటమి మేనిఫెస్టో గాయాలు మాన్పించేలా, అన్ని వర్గాలను మెప్పించేలా ఉందని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలిసంతకంతో దగా పడ్డ విద్యార్థి, నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు తెస్తుందని, ఫించన్లను రూ.4వేలకు పెంచటం, దుర్మార్గపు, చీకటి చట్టమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తానన్న హామీపై హర్షం వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని అమలు చేసి చూపించి రాష్ట్రంలో సంపద పెంచి ఇటు సంక్షేమాన్ని, అభివృద్ధిని వుంతలు తొక్కించేలా ఉందన్నారు.

మేనిఫెస్టోతో వైసీపీ నేతల్లో వణుకు : కొల్లు రవీంద్ర



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 : టీడీపీ కూటమి మేనిఫెస్టో చూసి వైసీపీ నేతల్లో వణుకు మొదలైందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మచిలీపట్నం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, టీడీపీ హయాంలో పేదప్రజలకు అండగా ఉన్న అన్నా క్యాంటీన్ వంటి పథకాలను వైసీపీ రద్దు చేసిందని, ఈ పథకాలను పునరుద్ధరిస్తామని ఉమ్మడి మేనిఫెస్టోలో చంద్రబాబు పేర్కొనడంతో వైసీపీ నేతల గుండెల్లో దడ పుట్టుకొచ్చిందన్నారు. ప్రతీ ఏటా జాబ్ కేలండర్ ప్రకటిస్తానని, నిరుద్యోగలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదన్నారు. అధికారంలోకి రాగానే తొలి సంతకం డీఎస్సీదని చెప్పడంతో నిరుద్యోగులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మహిళలకు మూడు వంటగ్యాస్ సిలెండర్లు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 వంటి పథకాలతో వారి ముఖాల్లో ఆనందం కనబడుతోందన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తానని చెప్పిన మాట నిలబెట్టుకుని మేనిఫెస్టోలో చేర్చారన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు రెండు సెంట్ల స్థలం ఇస్తామన్నారు. టీడీపీ హయాంలో పండుగలకు ఇచ్చిన కానుకల పథకాలు తిరిగి పునరుద్ధరిస్తామన్నారు. ఉమ్మడి మేనిఫెస్టో అందరికీ అనుకూలంగా ఉంటే బందరు ఎమ్మెల్యే విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ మేనిఫెస్టో ప్రజలను ఆకర్షించలేదని, అంకెల గారడీ అని అందరికీ తెలిసి పోయిందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ప్రచారంలో ఉన్న టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్న వైసీపీ మూకలు

టీడీపీ నేతలపై అక్రమ కేసులు!

▸ వసంత ఎన్నికల ప్రచార ర్యాలీలో వైసీపీ నేతల హల్‌చల్

▸ అక్రమ కేసుల సంస్కృతి వారికి కొత్త కాదు : వసంత

ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, ఏప్రిల్ 30 : కొటికలపూడి గ్రామంలో మైలవరం కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఎన్నికల ప్రచారానికి వస్తున్న అనూహ్య స్పందన చూసి వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. సోమవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు బాణాసంచా కాల్చుతుండగా అడ్డుకుని రోడ్డుపై విసిరివేశారు. ఈక్రమంలో వైసీపీ కార్యకర్తలకు స్వల్ప గాయాలు కాగా.. ఇదంతా వసంతే చేయించాడని ఆరోపిస్తూ మూలపాడుకు చెందిన వైసీపీ నేత కార్యకర్తలతో స్టేషన్‌కు వెళ్లి టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించాడు. అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకు పోలీసులు వసంతతో పాటు మరో తొమ్మిది మంది టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేశారు. వైసీపీ నేతలు పథకం ప్రకారం టీడీపీ ఎన్నికల ప్రచారంలో అల్లర్లు సృష్టించడమే కాక చర్చిలో ప్రార్థనలకు వెళ్లకుండా తాళాలు వేయించినట్టు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వారు కోరుతున్నారు.

అక్రమ కేసులు వారికి కొత్త కాదు..

అక్రమ కేసుల సంస్కృతి వాళ్లకి కొత్తేమి కాదని మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. కొటికలపూడి గ్రామంలో ర్యాలీలో జరిగిన ఘటనలో తనను మొదటి ముద్దాయిగా చేర్చి కేసు పెట్టించారని, అరకిలో మీటర్ దూరంలో వాహనంపై ఓట్లు అభ్యర్థిస్తుంటే నేను చేయమన్నానని నెపం మోపారన్నారు. అర్ధరాత్రి నాపై కేసు పెట్టింది చాలక తన కంపెనీ నుంచి రెండు వేలమంది వచ్చారని అభాండాలు వేస్తున్నారని, తన కంపెనీలో 200 మంది ఉద్యోగులే ఉన్నారన్నారు. మైలవరంలో పోటీ పెట్టిన వ్యక్తిపై జగన్ ఆయన సామాజిక వర్గానికి చెందిన అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి, హర్షా రెడ్డి, తిరుపతిరెడ్డి అనే ముగ్గురితో పాటు కడప, కర్నూలు నుంచి 80 మందిని రప్పించి ప్రతి నాయకుడిపై పెత్తందారిగా పెట్టారన్నారు. నాపై కేసులు పెట్టుకోండి.. ఏం జరుగుతుందో ప్రజలే నిర్ణయిస్తారన్నారు.



మాచవరంలో బుద్ధప్రసాద్ ఎన్నికల ప్రచారం

వైసీపీ దుర్మార్గ పాలన అంతం కావాలి.. : మండలి

కోడూరు, ఏప్రిల్ 30 : వైసీపీ దుర్మార్గపాలన అంతానికి సమయం ఆసన్నమైందని అవనిగడ్డ ఎన్డీఏ కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కోడూరు మండల పరిధిలోని మాచవరం గ్రామం నుంచి వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, పిట్టల్లంక, సాలెంపాలెం, వేణుగోపాలపురం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు డప్పు వాయిద్యాలతో మండలికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండలి మాట్లాడుతూ, ప్రజలందరూ దివిసీమ ప్రాంతాన్ని అభివృద్ధిపర్చింది ఎవరో అని గుర్తు చేసుకుని గాజు గ్లాసు గుర్తుపై రెండుఓట్లు వేసి తనను, వల్లభనేని బాలశౌరిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, ఒడుగు నాగబాబు, చిలకలపూడి పాపారావు, పి.ఎస్.రావు, కూరాకుల ప్రసాద్, పూతబోయిన శ్రీనివాసరావు, కోట కరుణ్ కుమార్ తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా విశ్వనాథపల్లి గ్రామానికి వెళ్లిన మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో విశ్వనాథపల్లి సచివాలయ కన్వీనర్ విశ్వనాథపల్లి హరిబాబు జనసేన పార్టీలో చేరారు.

878 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకం



▸ ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 47 శాతం పైగా గుర్తింపు

▸ ఎన్నికల సంఘానికి నివేదించిన జిల్లా యంత్రాంగం

▸ అత్యధికంగా విజయవాడ తూర్పులో 159

▸ అత్యల్పంగా నందిగామలో 77

▸ భద్రత పెంచేందుకు బలగాలు కోరిన జిల్లా యంత్రాంగం

▸ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో.. వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

నవ ఎన్టీఆర్ జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఆందోళనకలిగిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 47శాతం పైగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల సంఘానికి, జిల్లా ఎన్నికల యంత్రాంగం నివేదించింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1874 పోలింగ్ స్టేషన్లలో 878 వరకు సమస్యాత్మకంగా ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 720 లొకేషన్లలో ఒకటి నుంచి 15 వరకు కూడా పోలింగ్ స్టేషన్లు ఉంటాయి. ఈ లెక్కన మొత్తం 332 పోలింగ్ లొకేషన్లు సమస్యాత్మకంగా ఉన్నాయని జిల్లా ఎన్నికల యంత్రాంగం గుర్తించింది. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల లొకేషన్ల ఆధారంగా చూస్తే 46.11 శాతం మేర సమస్యాత్మకంగా ఉన్నాయని గుర్తించటం జరిగింది. గత సార్వత్రిక ఎన్నికల్లో చోటు చేసుకున్న వివాదాలు, అల్లర్లు, పోలింగ్ ప్రక్రియకు విఘాతం కలగటం, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అనుచరుల పరస్పర కవ్వింపులు అన్నింటినీ గమనంలోకి తీసుకుని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా గుర్తించారు. ప్రధానంగా 2009, 2014, 2019లలో చోటు చేసుకున్న గొడవలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎన్నికల యంత్రాం గం గట్టి బందోబస్తుకు బలగాల కోసం ఇప్పటికే పోలీసు యంత్రాంగానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించింది.

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఇవే..

జిల్లావ్యాప్తంగా 720 లొకేషన్లలో 1874 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తీవ్ర హింసాత్మక పోలింగ్ కేంద్రాలు లేకపోయినా.. సమస్మాత్మక కేంద్రాలు 878 వరకు ఉన్నాయని గుర్తించారు. వీటిలో అత్యధికంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 159, సెంట్రల్ నియోజకవర్గంలో 134, తిరువూరులో 129, మైలవరం నియోజకవర్గంలో 124, జగ్గయ్యపేటలో 116, విజయవాడ పశ్చిమలో 97, నందిగామలో 77 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకంగా ఉన్నాయని గుర్తించారు.

గన్నవరం అత్యంత సమస్యాత్మకం..

కృష్ణాజిల్లా పరిధిలోకి వచ్చే గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలం పరిధిలోని కొన్ని గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలో అంతర్భాగంగా ఉంటాయి. విజయవాడ రూరల్ మండల పరిధిలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, నున్న, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి, నైనవరం, పాతపాడు, గొల్లపూడి వంటి గ్రామాలలో ఎన్నికల నిర్వహణ బాధ్యత ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగంపైనే ఆధారపడి ఉంది. ఈ ప్రాంతాల్లో కొన్ని మైలవరం నియోజకవర్గ పరిధిలోకి, కొన్ని గన్నవరం నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. మైలవరం నియోజకవర్గం ఎన్టీఆర్ జిల్లాకు చెందింది కాబట్టి వీటి కౌంటింగ్ అంతా ఇక్కడే నిర్వహిస్తారు. గన్నవరం నియోజకవర్గానికి చెందిన గ్రామాలకు సంబంధించి కృష్ణాజిల్లాలో లెక్కింపు జరుగుతుంది. ఎన్నికల నిర్వహణ మాత్రం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగమే చూసుకోవాల్సి ఉంటుంది. గత ఎన్నికలలో ప్రసాదంపాడులో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. రామవరప్పాడు, ఎనికేపాడు, నిడమానూరు, నున్న, కొత్తూరు తాడేపల్లి వంటి ప్రాంతాలలో గొడవలకు ఆవకాశాలు కనిపిస్తున్నాయి. స్థానికంగా ఉన్న రాజకీయ పరిస్థితులు, పరస్పరం రెచ్చగొట్టుకుంటున్న తీరు, బల సమీకరణలతో పోటీకి ముందే గన్నవరంలో ఒక రకమైన యుద్ధ వాతావరణం నెలకొంది. ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగాన్ని ఈ పరిణామాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ పోలింగ్ కేంద్రాలపైనా సీరియస్‌గా దృష్టి సారించాలని నిర్ణయించటం జరిగింది.

సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్

జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లంటిలోనూ వెబ్ క్యాస్టింగ్ నిర్వహించాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం నిర్ణయించింది. సాంకేతిక కన్ను ఈ సమస్యాత్మక కేంద్రాల మీద పర్యవేక్షణ చేస్తోంది. మొత్తం 913 పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తారు. ఈ పోలింగ్ కేంద్రాలలో ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారంలో లైవ్‌గా ఆయా స్టేషన్ల స్థితిగతులను గమనిస్తూ ఉంటారు. దీంతో పాటు పోలింగ్ కేంద్రాల ఆవరణ, చుట్టుపక్కల, 100 మీటర్ల దూరం నుంచి పోలింగ్ కేంద్రాల సమీపం వరకు వీడియోగ్రఫీ కూడా చేయించాలని నిర్ణయించారు. గుర్తించిన 430 పోలింగ్ స్టేషన్లలో వీడియోగ్రఫీ చేయిస్తున్నారు.

తొలి దశ అడ్మిషన్‌కు 600 మంది విద్యార్థుల ఎంపిక

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 : ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న కృష్ణాజిల్లా విద్యార్థులకు తొలి దశ అడ్మిషన్‌లో 697 మందిని ఎంపిక చేసినట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. మంగళవారం డీఈవో మాట్లాడుతూ, ఎస్సీ కేటగిరిలో 309, ఎస్టీ కేటగిరిలో 16, బీసీ 253, మైనారిటీ 34, ఓసీ కేటగిరిలో 88 మంది పిల్లలు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు అడ్మిషన్ ప్రక్రియ బుధవారం నుంచి మే 10వరకు నిర్వహిస్తారన్నారు. మండలస్థాయిలో మే 11న ఎంఈవోలకు ఏవైనా అభ్యంతరాలుంటే తెలపవచ్చన్నారు. ఎంఈవోలు 14వ తేదీన ఫిర్యాదుల జాబితా తెలపాలన్నారు. డీఈవో ఆ ఫిర్యాదులను మే 15న ఎస్‌పిడికి తెలియచేస్తారన్నారు. 16, 17 తేదీల్లో సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులను పరిష్కరిస్తారన్నారు.

అమరావతి రాజధానిగా కొనసాగాలంటే.. ఎన్డీఏ అధికారంలోకి రావాలి



▸ మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు

నందిగామ, ఏప్రిల్ 30 : అమరావతి రాజధానిగా కొనసాగాలంటే ఎన్డీఏ అధికారంలోకి రావాలని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఐతవరంలోని తన నివాసంలో అమరావతి జేఏసీ నేత పోతుల బాలకోటయ్య, రాష్ట్ర బీసీ నాయకురాలు యలగాని నూకానమ్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం కోసం భూములు త్యాగం చేసిన అమరావతి రైతులను మోసం చేస్తూ జగన్ రాజధాని మార్పుకు ముందుకు వచ్చాడన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన వ్యక్తిగత ప్రయోజనాలే లక్ష్యంగా జగన్ పని చేస్తున్నాడని ఆరోపించారు. అమరావతి రాజధానిని నాశనం చేసిన జగన్ అధికారంలోకి వస్తే విశాఖ నుంచి పాలిస్తానని ప్రకటించడం దారుణమన్నారు. ప్రజలు ఈ అంశాలను పరిగణంలోకి తీసుకొని ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే అమరావతి నిర్మాణం పూర్తవుతుందని, ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. చంద్రబాబు వంటి మేధావి పాలన ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా మ్యానిఫేస్టో విడుదల చేసిన కూటమి నేతలకు ఆయన అభినందనలు తెలిపారు. పోతుల బాలకోటయ్య యలగాని నూకానమ్మలు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి మ్యానిఫేస్టోలో మంచి ప్రాధాన్యత దక్కిందన్నారు.

గుడివాడను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

▸ ఎన్నికల ప్రచారంలో వల్లభనేని బాలశౌరి, వెనిగండ్ల రాము హామీ

గుడివాడ, ఏప్రిల్ 30 : గుడివాడను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని, ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పథంలో నడిపిస్తామని మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ కూటమి టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ప్రజలకు హామీ యిచ్చారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి వారు మాట్లాడుతూ, అభివృద్ధి అంటే పట్టని, గిట్టని వైసీపీ నేతలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. జగన్, నానిలకు ఓట్లు యావ తప్ప, ప్రజల గోడు పట్టదని, సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నేతలు దింట్యాల రాంబాబు, యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో గ్లాస్ చూపుతున్న బాలశౌరి, వెనిగండ్ల, రావి

వెనిగండ్ల సమక్షంలో టీడీపీలోకి చేరికలు

పలువురు వైసీపీ కార్యకర్తలు వెనిగండ్ల రాము సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే కొడాలి నానికి అత్యంత సన్నిహితుడు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సభ్యుడు, బీసీ నేత కిలారపు రంగప్రసాద్ వెనిగండ్ల సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. వెనిగండ్ల, బాలశౌరిల సమక్షంలో రైలుపేటకు చెందిన మహిళలు, యువత టీడీపీలో చేరారు. స్థానిక 25వ వార్డుకు చెందిన వడ్డెర కులస్థులు 150మంది టీడీపీలో చేరారు. జనసేన జిల్లా నాయకులు పాలంకి సారథిబాబు, వార్డు ఇన్‌చార్జ్ దారపురెడ్డి శేషు, మైనార్టీ నాయకులు షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు సర్వం సిద్ధం చేయండి

▸ మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్

వన్‌టౌన్, ఏప్రిల్ 30 : హజ్ యాత్ర విజయవంతానికి కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ అన్నారు. హజ్-2024 యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో సన్నద్ధత సమావేశం మంగళవారం వన్‌టౌన్‌లోని షాదీఖానాలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హజ్ యాత్రకు ఈ ఏడాది కోటా 2,902 మందికి గాను ఇప్పటివరకు 2,580 మంది నమోదు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 720 మంది, హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1118 మంది, బెంగుళూరు ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 720 మంది, చెన్నై ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 9 మంది యాత్రకు బయలుదేరనున్నట్టు వివరించారు. హజ్ యాత్రీకులు ఆయా ఎంబార్కేషన్ పాయింట్‌ల నుంచి మే 26 నుంచి జూన్ 9వ తేదీ మధ్య బయలుదేరతారని తెలిపారు. సుమారు 38 నుంచి 42 రోజుల యాత్ర ముగించుకుని జూలై 1 నుంచి 21వ తేదీ లోగా తిరిగి విజయవాడ చేరుకుంటారని తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి యాత్రీకుల ప్రయాణానికి స్పైస్‌జెట్ సేవలు అందించడానికి ముందుకు వచ్చినట్టు తెలిపారు. హజ్ యాత్రీకుల సౌకర్యార్థం గన్నవరం ఎయిర్‌పోర్ట్ సమీపంలోని మదర్సాలో బస ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. హజ్ యాత్రికులకు సుమారు 40 రోజుల పర్యటనకు మాత్రమే అనుమతి ఉందని అంతకంటే ఎక్కువ రోజులకు అనుమతి లేదని ఆయన వివరించారు. హ్యాండ్‌బ్యాగ్ లగేజీ కింద 8 కేజీల బ్యాగు, చెక్ ఇన్ లగేజీ కింద 20 కేజీల బరువున్న రెండు బ్యాగులకు అనుమతి ఉందని తెలిపారు. ఎస్‌బీఐ బ్యాంకు తమ శాఖ తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క యాత్రీకునికి సుమారు రూ.4లక్షల వరకు ఫారిన్ ఎక్స్ఛేంజ్ అందిస్తున్నట్టు తెలిపారు. సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ షేక్ హాలీం బాషా, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారి లక్ష్మీకాంతరెడ్డి, హజ్ కమిటీ స్టేట్ సభ్యులు, ఏపీ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎల్.అబ్దుల్ ఖాదర్, ఎస్‌బీఐ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.నాగవేణి, డిప్యూటీ జనరల్ మేనేజర్ మనీష్ కుమార్, ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

▸ కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని, ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఎన్నికల పరిశీలకులతో కలిసి కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి 15మంది, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 12, గుడివాడ 12, పెడన 10, మచిలీపట్నం 14, అవనిగడ్డ 12, పామర్రు 8, పెనమలూరు నియోజకవర్గంలో 11 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు తెలిపారు. జిల్లాలో ఈనెల 25వ తేదీ నాటికి మొత్తం ఓటర్లు 15,39,460 కాగా, వీరిలో 7,46,071 మంది పురుష ఓటర్లు, 7,93,332 మంది మహిళా ఓటర్లు, 57 మంది ఇతర ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. పోలింగ్ విధుల్లో ఉన్న ఉద్యోగులతోపాటు సర్వీస్ ఓటర్లు, 85 సంవత్సరాలకు పైబడిన, దివ్యాంగ ఓటర్లు, ఎసెన్షియల్ సర్వీస్ కింద గుర్తించిన వివిధ శాఖల ఉద్యోగులకు కేంద్ర ఎన్నికలసంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందన్నారు. వీరి నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ ఓటింగ్‌కు ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఓటు ఏ నియోజకవర్గంలో ఉందో అక్కడే పోస్టల్ ఓటింగ్ వినియోగించుకోవాలని తెలిపారు. ఇంటి వద్దనే ఓటింగ్ కొరకు బృందాలను నియమించామని, మే నెల2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఈ బృందాలు ఇంటింటికీ వెళ్లి హోం ఓటింగ్ నిర్వహిస్తాయని, ఇంకా ఎవరైనా హోం ఓటింగ్ వినియోగించుకోని వారుంటే మే 9, 10 తేదీల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ, ఎన్నికలలో శాంతి భద్రతల ఏర్పాట్లు వివరించారు. ఇప్పటి వరకు రూ.10.50కోట్ల వరకు నగదు మద్యం ప్రలోభాలకు సంబంధించి వస్తువులను సీజ్ చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు జాన్ కింగ్స్ లే, నరహరి సింగ్ బంగేర్, వ్యయ పరిశీలకులు మనీష్‌కుమార్ చావ్ల, చవాన్ ప్రవీణ్ మోహన్‌దాస్, వికాస్ చంద్ర కరోల్, పోలీస్ పరిశీలకులు ప్రసాద్ ప్రలాద్ అక్కనోరు, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

కలిసొచ్చే కాలం..



కర్నూలు జిల్లా నందికొట్కూర్‌లో చంద్రబాబును కలిసిన ముద్దరబోయిన

సొంతగూటికి ముద్దరబోయిన

▸ గన్నవరం, గుడివాడలో పనిచేయాలని అధినేత ఆదేశం

▸ ముద్దరబోయిన బాధ్యత తనదని స్పష్టం చేసిన చంద్రబాబు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/నూజివీడు): ఉమ్మడి కృష్ణాజిల్లాలో టీడీపీకి కాలం కలిసి వస్తోంది. నూజివీడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు టీడీపీ అధినేత బుజ్జగింపుతో సోమవారం నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. అనంతరం కర్నూలు జిల్లా నందికొట్కూర్‌లో ఉన్న చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ముద్దరబోయినను గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో తిరిగి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని చంద్రబాబు సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముద్దరబోయిన బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. నూజివీడు, గన్నవరం, గుడివాడ, మైలవరం, కనిగిరినియోజకవర్గాల్లో ముద్దరబోయిన సేవలను వినియోగించుకోవాలని పార్టీ నిర్ణయించింది.

ముద్దరబోయిన రాకతో ఆ రెండు చోట్ల ఊపు

యాదవ సామాజికవర్గానికి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు బీసీల్లో మంచి పట్టుంది. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల్లో ఉపయోగించుకుంటే బీసీల ఓట్లను సునాయాసంగా టీడీపీ ఖాతాలో వేసుకోవచ్చు. గతంలో ముద్దరబోయిన గన్నవరం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది తర్వాత కాంగ్రెస్‌పార్టీలో చేరారు. సుదీర్ఘకాలం బీసీ సంఘాల్లో జిల్లా రాష్ట్రస్థాయి పదవుల్లో పనిచేశారు. 2014లో టీడీపీలో చేరిన ముద్దరబోయినకు 2014, 2019లలో నూజివీడు టీడీపీ టికెట్ ఇచ్చినా ఆయన విజయం సాధించకపోవడంతో, 2024లో కొలుసు పార్థసారథికి నూజివీడు తెలుగుదేశం టిక్కెట్‌ను కేటాయించింది. దీంతో అలిగి ముద్దరబోయిన పార్టీని వీడారు. అయితే ముద్దరబోయినకు బీసీల్లో ఉన్న పట్టు దృష్ట్యా టీడీపీ ఆయన్ను వదులుకునేందుకు ఇష్టపడలేదు.

ముద్దరబోయిన సేవలను వినియోగించుకోవాలనే వ్యూహంతో ఆయనకు నచ్చచెప్పి మళ్లీ పార్టీలోకి తీసుకువచ్చారు. తెలుగుదేశంపార్టీకి అత్యంత కీలకమైన గన్నవరం, గుడివాడ నియోజకవర్గాలతో పాటు మైలవరం, కనిగిరి నియోజకవర్గాల్లో కూడా ఆయన సేవలు వినియోగించుకునే పార్టీ వ్యూహరచన చేస్తోంది.



రావి హరగోపాల్ నగర్‌లో ఓటర్ల స్లిప్‌ల పంపిణీలో వలంటీర్ కోటిప్రసాద్ (సర్కిల్‌లో)

ఎన్నికల విధుల్లో వలంటీర్!



వలంటీర్‌కు ఇచ్చిన ఓటర్ల స్లిప్‌లు లెక్కిస్తున్న బీఎల్వో

పామర్రు, ఏప్రిల్ 30 : ఎన్నికల విధుల్లో వలంటీర్ల ప్రమేయం ఉండకూడదన్న ఎన్నికల సంఘం ఆదేశాలను కొందరు బేఖాతరు చేస్తున్నారు. ఎన్నికల సంఘం ద్వారా ఓటర్లకు స్లిప్‌ల పంపిణీలో బీఎల్వోకు సహాయకుడిగా అధికార పార్టీకి చెందిన ఓ వలంటీర్ ప్రమేయంపై సీ-విజిల్ యాప్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి కె.శ్రీలక్ష్మి బృందం పట్టణంలోని రావిహరగోపాల్‌నగర్‌లో 165 నెంబరు పోలింగ్‌స్టేషన్‌కు సంబంధించి ఓటర్లకు అందించే స్లిప్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బీఎల్వో శావరాజు వలంటీర్ సూదులగంటి కోటిప్రసాద్‌ను స్లిప్‌ల పంపిణీలో భాగస్వామిని చేసినట్టు లిఖితపూర్వకంగా తెలియజేసినట్టు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఎల్వో రాజుతోపాటు వలంటీర్ కోటిప్రసాద్‌ను విధుల నుంచి తప్పించి, చర్యల నిమిత్తం ఎన్నికల అధికారికి సిఫార్సు చేసినట్టు ఎంపీడీవో ఎం.భారతి, శ్రీలక్ష్మిలు వెల్లడించారు. తనిఖీ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రాజీనామా లేఖలు ఎంపీడీవోకు ఇస్తున్న వలంటీర్లు

కొనసాగుతున్న రాజీనామాలు

మోపిదేవి : మోపిదేవి మండలం గ్రామసచివాలయాల్లో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మంగళవారం నాగాయితిప్ప, మోపిదేవిలంక పంచాయతీల్లోని 15 మంది, పెదప్రోలు సచివాలయంలో 14, ఉత్తర చిరువోలులంక ఐదు, కె.కొత్తపాలెం ఐదుగురు వలంటీర్లు తమ రాజీనామా లేఖలను ఎంపిడివో కె.శ్రీనివాసరావుకు అందజేశారు. వ్యక్తిగత కారణాలతో వాలంటీర్ల విధులకు రాజీనామా చేస్తున్నట్లు లేఖలు ఎంపీడీవోకు అందజేశారు.

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండలంలో 60 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో జ్యోతి మంగళవారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామపంచాయతీలకు చెందిన వలంటీర్లు రాజీనామా పత్రాలు అందజేసినట్టు, వాటిని ఆమోదించినట్టు ఆమె తెలిపారు. రూరల్ మండలంలో ఇప్పటి వరకు 170 మందికిపైగా రాజీనామాలు చేసినట్టు ఆమె తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.3.70

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 30 : స్థానిక శ్రీలక్ష్మీ వేంకటేశ్వస్వామి ఆలయంలో మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మే 4వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు, యాజ్ఞిక స్వామి ముడంబై శ్రీకాంత్‌కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ట్రస్టీలు కాకాని అరుణబాబు, తవ్వా పూర్ణచంద్రరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకర సుభాష్‌చంద్రబోస్ పూజా కార్యక్రమాలతో బ్రహ్మోత్స వాలు ప్రారంభించారు. అష్టోత్తర కలశాభిషేకం, పుణ్యనది తీర్థాభిషేకం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను ఆలయ ఈవో వై.శ్రీని వాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు నందిగం స్వామి, వెనిగళ్ల వెంకట రంగారావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదరించండి.. సైనికుడిలా పనిచేస్తా

కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు



సూరంపల్లిలో మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఏప్రిల్ 30 : ఆదరించండి సైనికుడిలా పనిచేస్తా.. రైతుల కష్టాలు తెలిసిన వాడిని.. గెలిపించండంటూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని సూరంపల్లిలో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. తొలుత యార్లగడ్డ వెంకట్రావుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ ప్రదర్శనతో గ్రామంలోకి తీసుకువెళ్లి ప్రచారం జరిపారు. మహిళలు హారతులిచ్చారు. బంతిపూలతో పూలవర్షంలా కురిపించారు. రాళ్లకట్ట సెంటర్‌లో యార్లగడ్డ మాట్లాడుతూ, తాను ఇక్కడ ఉండనని, అమెరికా వెళ్లిపోతానని దుష్ప్రచారం చేస్తున్నారని, తన పిల్లలని కూడా విజయవాడలోనే చదివిస్తున్నానని ఇక్కడే ఉంటానని స్పష్టం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాస్, దేవరపల్లి కోటేశ్వరరావు, మండవ అన్వేష్, గొట్టిపూళ్ల వీరబాబు, గండికోట సీతయ్య, గొట్టిపూళ్ల శ్రీనాద్, రఘు, బెజవాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే రామచంద్రపాలెంలో కూడా ప్రచారం నిర్వహించారు.

టీడీపీతోనే మహిళలకు రక్షణ



వీరపనేనిగూడెంలో మహిళలకు బొట్టు పెట్టి ఓటు అడుగుతున్న తెలుగు మహిళలు

టీడీపీ అధికారంలోకి వస్తేనే మహిళలకు రక్షణ ఉంటుందని తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి మండవ లక్ష్మీ అన్నారు. మండలంలోని వీరపనేనిగూడెంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ, బీసీ కాలనీలలో మహిళలకు బొట్టుపెట్టి యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని బాలశౌరిలకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మండవ లక్ష్మీ మాట్లాడుతూ, మహాశక్తి పథకంతో ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఏడాదికి 15వేలు చొప్పున ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా ఇవ్వటం జరుగుతుందన్నారు. చిక్కవరపు నాగమణి, బుస్సే సరితాదేవి, బొప్పన జమున రాణి, మాచినేని రాధిక కంభంపాటి లక్ష్మీ, కాశీ రాణి, మరియమ్మ, శాంతమ్మ, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, కొండేటి వెంకటేశ్వ రరావు, రారాజు పాల్గొన్నారు.

పట్టిసీమతో రైతులకు మేలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పట్టిసీమ ద్వారా సకాలంలో నీరందిస్తూ రైతులకు మేలు చేసింది టీడీపీనేనని గన్నవరం టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రంగన్నగూడెంలో పార్టీ కార్యాలయాన్ని సోమవారం రాత్రి ఎంపీ అభ్యర్థి బాలశౌరితో కలిసి ప్రారంభించారు. ముందుగా శ్రీకృష్ణ దేవాలయంలో పూజలు చేసి, అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఇటింటి ప్రచారం నిర్వహించారు. ఆళ్ల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, మహిళలు పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గ్రామానికి మంచి చేయాలనే ఉద్దేశంతో పంచాయతీలో పోటీచేసి ఓడిన మహిళకు పీఏసీఎస్ ఛైర్మన్ పదవి ఇచ్చి బ్యాంకు బిల్డింగ్‌కు నిధులు మంజూరు చేస్తే యువగళం పాదయాత్ర సందర్భంగా నాతో సహా 40మందిపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలశౌరి మాట్లాడుతూ, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వీరవల్లి వద్ద ఆర్వోబీ నిర్మాణం తక్షణం మొదలుపెట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చలమలశెట్టి రమేష్‌బాబు, బచ్చుల బోస్, చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయి కళ్యాణి, దయాల రాజేశ్వరరావు, గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, మొవ్వా వేణుగోపాల్, మరీదు తిరుపతిరావు, యనమదల వెంకయ్యారావు, ఆలూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి టీడీపీతోనే



రంగయ్యప్పారావుపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న లింగం శ్రీధర్, పొట్లూరి ప్రసాద్

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని పొట్లూరి ప్రసాద్, లింగం శ్రీధర్ అన్నారు. రంగయ్యప్పారావుపేట టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలతో పాటు మేనిఫెస్టో ద్వారా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. యార్లగడ్డ వెంకట్రావును, బాలశౌరిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్నంగి శేషగిరిరావు, చింతల అప్పారావు, జాస్తి భూపతిరావు, దన్నే గాంధీ, కానూరి వేణుగోపాలరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, తుమ్మల రాము, చలసాని శ్రీనివాస్, గరికపాటి ఉమ, దోనె అశోక్, విజయభాస్కరరావు, బోయపాటి వేణు, కలిదిండి పద్మనాభరాజు, తదితరులు పాల్గొన్నారు.

వెల్దిపాడు, నాగవరప్పాడులో ..



నాగవరప్పాడులో టీడీపీ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న యార్లగడ్డ సతీష్

ఉంగుటూరు : ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రకటించిన ఉమ్మడి మేనిఫెస్టో ఎంతో తోడ్పాటునందిస్తుందని, వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలు గుర్తించి, అభివృద్ధికి బాటలు వేసే సమర్థవంతమైన విజన్ వున్న నేత చంద్రబాబునాయుడిని సీఎంగా ఎన్నుకోవటంద్వారా రాష్ట్రానికి ప్రగతి, ప్రజలకు బంగారు భవిష్యత్తు వుంటుందని గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీష్ అన్నారు. ఎన్నికల శంఖారావంలో భాగంగా మంగళవారం మండలంలోని వెల్దిపాడు, నాగవరప్పాడులో తన సతీమణి శ్రీలక్ష్మితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ మేనిఫెస్టోలోని పథకాలను వివరిస్తూ, కరపత్రాలు పంచుతున్న సతీష్ దంపతులకు ప్రజలు మంగళ హారతులు పట్టారు. ఈ ప్రచారంలో టీడీపీ నాయకులు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, బి.నాగేశ్వరరావు, పరిటాల విష్ణు, రాజమన్నార్, కిరణ్ కుమార్, కాట్నేని మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వంశీ అరాచకాలను అడ్డుకుందాం

- యార్లగడ్డ వెంకట్రావును గెలిపించుకుందాం
- వైసీపీ మహిళా నేతల పిలుపు



మాట్లాడుతున్న వైసీపీ నాయకురాలు ఆళ్ల నాగమణి, దారం ఝాన్సీరాణి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 30 : గన్నవరం నియోజకవర్గంలో రోజురోజుకు పెరుగుతున్న వల్లభనేని వంశీ అరాచకాలను ఓటుతో అడ్డుకుందామని, సౌమ్యుడైన యార్లగడ్డ వెంకట్రావును గెలిపించుకుందామని రంగన్నగూడెం మాజీ సర్పంచ్, వైసీపీ నాయకురాలు ఆళ్ల నాగమణి పిలుపు నిచ్చారు. రంగన్నగూడెంలోని తన స్వగృహంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ, ఇటీవల యువగళం పాదయాత్ర సందర్భంగా ఫ్లెక్సీ ముద్రించి వివాదానికి కారణమైన వ్యక్తులను వదిలివేసి గ్రామానికి చెందిన వారిపై గ్రామంలో లేకపోయినా కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసుల్లో ఉన్నవారు ఇద్దరు తప్ప మిగిలిన 50మంది వంశీకి ఓట్లువేసినవారేనన్నారు. ఈ ఘటనలో తన భర్త ఆళ్ల గోపాలకృష్ణ, యార్లగడ్డ వెంకట్రావుల పేర్లు కూడా ఇరికించడం దారుణమన్నారు. కేవలం వంశీ చెప్పిన మాట వినలేదని తన భర్తపై అక్రమకేసులు పెట్టారని నాగమణి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచి వ్యక్తులకు మద్దతు ఇవ్వాలనే ఉద్ధేశంతో తామంతా యార్లగడ్డ వెంకట్రావుకు మద్దతుగా ఉంటామని, వైసీపీ శ్రేణులు కూడా గమనించి మంచి వ్యక్తికి ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దారం ఝాన్సీరాణి, నత్తా రత్నకుమారి, నత్తా ఏసమ్మ, అలపాటి లక్ష్మీ, కొలుసు వెంకటేశ్వరరావు, దారం సుజాత, నత్తా మనోహర్‌రాజు, ఆళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్చుకునేందుకు సిద్ధంగా ఉండు

ముద్రగడ పద్మనాభంపై జనసేన నేతల మండిపాటు

కంకిపాడు, ఏప్రిల్ 30 : వైసీపీకి ఎంతకి అమ్ముడు పోయావో చెప్పాలని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంను జనసేన పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా ప్రశ్నించారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కాపు రిజర్వేషన్ అంటూ ఉద్యమించిన నీవు వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్కసారి అయినా కాపు రిజర్వేషన్‌పై మాట్లాడా వా, జగన్‌ని నిలదీశావా అని ప్రశ్నించారు. పవన్‌కళ్యాణ్ ఎక్కడ నుంచి పోటీ చేస్తే నీకేంట న్నారు. నువ్వు చెప్పిన చోటు నుంచే పోటీ చేయాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ గెలవ డం ఖాయమని, నువ్వు పేరు మార్చుకు నేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ సమావే శంలో జరుగు ఆదినారాయణ, లీల్ల అయ్యప్ప, అడపా నాగశ్రీ, సుంకర శివ, కార్తికేయ పాల్గొన్నారు.

దూరంగా.. నిరుపయోగంగా!

- నియోజకవర్గ ప్రజాప్రతినిధికి ఖాళీ లేక ప్రారంభానికి నోచుకోని ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లు
- రైతులకు, ప్రజలకు ఉపయోగం శూన్యం
- నాలుగేళ్లుగా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా



బాపులపాడు-3 సచివాలయం పరిధిలో సూరమ్మ చెరువు వద్ద నిర్మించిన ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్‌లు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 30 : లక్షలాది రూపాయల ప్రజాధనంతో బాపులపాడులో నిర్మించిన ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లు ప్రజలకు అక్కరకు రాకుండా పోతున్నాయి. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో బాపులపాడు -3 సచివాలయం పరిధిలో సూరమ్మ చెరువు వద్ద రూ.20.8లక్షలు వ్యయంతో నిర్మించిన వెల్‌నెస్ సెం టర్, రైతులకు సేవలు అందించాలనే ఉద్దేశంతో రూ. 23.9లక్షలు వ్యయంతో నిర్మించిన ఆర్బీకే సెంటర్ ప్రా రంభానికి నోచుకోలేదు. ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంతో ఆ భవనాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఎన్నికలు వచ్చేస్తున్నాయని హడావిడి చేసి గత నెల 20వ తేదీన ఈ రెండు కేంద్రాలను ప్రారంభించడానికి సన్నాహాలు చేశారు. చివరికి మాజీ ఎమ్మెల్యేకు వాటిని ప్రారంభించే సమయం లేకపోవడంతో ఈ రెండు కేంద్రాలు నిరుపయోగంగా పడిఉన్నాయి. 2021 సెప్టెంబరులో ఈ రెండు కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టి ఈ ఏడాది జనవరి నాటికి పూర్తి చేశారు. భవన నిర్మాణంపైనే అప్పట్లో అనేక విమర్శలు వెల్లువెత్తాయి. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్మించలేదని పెదవి విరిచారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన వెల్‌నెస్ సెంటర్ ముళ్ల కంచెల మధ్య ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలకు గురైంది. దాదాపు రెండేళ్ల పాటు నత్తనడకగా పనులు సాగించి ఎన్నికలు షెడ్యూల్ ముందుకు వస్తుందని నెపంతో రంగులు వేశారు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో వాటిని ప్రారంభించకుండానే వదిలేశారు. ఆలనాపాలన లేకపోవడంతో భవనాలు చుట్టు ముళ్లకంపలు పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ప్రజానీకం పెదవి విరుస్తున్నారు.

సైకో పాలనలో అభివృద్ధి శూన్యం

కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్



కలవపాములలో బోడె ప్రసాద్, రాజేంద్రప్రసాద్ ఎన్నికల ప్రచారం

పెనమలూరు, ఏప్రిల్ 30 : సైకో జగన్‌రెడ్డి ప్రభుత్వంలో పెనమలూరు నియోజకవర్గ రూరల్ గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని టీడీపీ కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెదపులిపాకలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ముసునూరి శ్రీనివాసరావు, ముసునూరు నిర్మల్, తెలుగు యువత అధ్యక్షుడు గుజ్జర్లపూడి బాబూరావుల ఆధ్వర్యంలో జరిగిన ప్రచారయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పెదపులిపాక, చోడవరం, గంగూరు, వణుకూరు, గోసాల, పెనమలూరు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాలను బందరు రోడ్డుతో అనుసంధానం చేయడాన్ని మొదటి ప్రయారిటీగా ఎంచుకొంటామని తెలిపారు. గ్రామాలలో ఉన్న కాల్వ కట్టల ప్రజల జీవన పరిస్థితిని మార్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమం లో ముప్పా రాజా, కోయ ఆనంద్ ప్రసాద్, మారుపూ డి ధనకోటేశ్వరరావు, మేకా స్వాతి, కరిమికొండ సు రేష్, వీరన్, ఫిరోజ్, పులిపాక సుదర్శన్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో రైతుల కష్టాలు

ఉయ్యూరు : వైసీపీ అసమర్థ, అవినీతి, అరాచక పాలనలో రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నా రని, జగన్మోహన్‌రెడ్డి పాలనకు మంగళం పలికేందుకు సంసిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళ వారం కలవపాములలో పర్యటించి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు ఓట్లువేసీ ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పడాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మెగా డీఎస్సీ, వృద్ధాప్య పింఛను రూ. 4వేలు, దివ్యాంగులకు రూ. 6వేలు కూటమి ప్రకటించిందన్నారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు, యువతకు ఉద్యోగాలు, ప్రతిరైతుకు ఏడాదికి రూ. 20వేలు పెట్టుబడి వంటి పలు హామీలు అమలు చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. టీడీపీ నాయకులు సంగెపు రంగారావు, వెల్లంకి సురేంద్ర, రాజ, అనగాని వెంకట నరసింహారావు, మల్లేశ్వర రావు, సజ్జా మధు, కొండా ప్రవీణ్, పామర్తి శ్రీను, సూరపనేని ప్రసాద్, జనసేన నాయకులు ముప్పా రాజా, ఆదినారాయణ, బీజేపీ నాయకుడు పోతురాజు, రామారావు పాల్గొన్నారు.



కంకిపాడులో ఎన్నికల ప్రచారం

జగన్ పాలనలో ఎస్సీలకు అన్యాయం

జగన్ పాలనలో ఎస్సీలు, బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ ఎస్సీసెల్ కార్యదర్శి డీఎస్ఆర్, ఎస్సీ నాయకుడు బత్తుల కామేశ్వరరావు ఆరోపించారు. టీడీపీ, జనసే, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మంగళ వారం ఉయ్యూరు ఎస్సీ కాలనీలో పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. జనసేన మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి బాలశౌరి, పెనమలూరు అసెంబ్లీ అభ్యర్థి బోడె ప్రసా ద్ ఎన్నికల గుర్తులు గాజుగ్లాసు, సైకిల్‌పై ఓటువేసి గెలింపిచాలని అభ్యర్థించారు. ఎస్సీ సెల్ కంకిపాడు మండల అధ్యక్షుడు బండి కృష్ణబాబు, టీడీపీ నాయ కుడు జల్లే కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఈడుపుగల్లులో ఎన్నికల ప్రచారంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా

యువత భవిష్యత్ టీడీపీతోనే సాధ్యం

కంకిపాడు : తెలుగుదేశం పార్టీతోనే యువత భవిష్యత్ సాధ్యమని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్ అన్నారు. కంకిపాడులో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీరుకొండ సుబ్బారావు, అన్నవరపు శివపార్వతి, జనసేన పార్టీ నాయకులు గడ్డం నెహ్రూ, పచ్చిపాల శేఖర్, కాపు సంక్షేమ సమాఖ్య పచ్చిపాల రాజ తదితరులు పాల్గొన్నారు.

● కంకిపాడు లాకు రోడ్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో యూనిట్ ఇన్‌చార్జి పులి శ్రీనివాసరావు, బండి నాంచారయ్య, కొండా నాగేశ్వరరావు, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, గోగినేని వెంకటరమణ, షేక్ బాజీ, గుమ్మడి కిరణ్, వజ్రకుమారి పాల్గొన్నారు.

● ఈడుపుగల్లులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, మాబు సుబాని, సుంకర శ్రీదేవి, బొప్పన నీరజ, పుట్టగుంట రవి, షేక్ షకాంర్, పర్వతనేని రవి, వెనిగళ్ల రమేష్, షేక్ శ్రీను, బాలాజి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● కుందేరులో నిర్వహించిన ప్రచారంలో బోడె వెంకట్రామ్, రాజు, షేక్ నాగుల మీరావలి, చల సాని వెంకటేశ్వరరావు, ఆళ్ల నాని, మీరావలి, శ్రీనివాస రావు, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, సుంకర వాసు పాల్గొన్నారు.

● ఉప్పలూరులో నిర్వహించిన ప్రచారంలో చలసాని రాధాకృష్ణ, పడవల మధుసూదనరావు, కొండవీటి శివయ్య, కలపాల రాజేష్, లాం చంద్రయ్య, వరలక్ష్మీ, ఏసుబాబు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు నియోజకవర్గ విజేతలు వీరే..				
2009	డీవైదాస్	కాంగ్రెస్	ఉప్పులేటి కల్పన	టీడీపీ
2014	ఉప్పులేటి కల్పన	వైసీపీ	వర్లరామయ్య	టీడీపీ
2019	కైలే అనిల్‌కుమార్	వైసీపీ	ఉప్పులేటి కల్పన	టీడీపీ
గతంలో ఈ పామర్రు మండలం నిడుమోలు నియోజకవర్గంలో ఉండేది.				
1962	గుంటూరు బాపనయ్య	సీపీఐ	కనుమూరి సోమేశ్వరరావు	కాంగ్రెస్
1967	కనుమూరి సోమేశ్వరరావు	కాంగ్రెస్	గుంటూరు బాపనయ్య	సీపీఐ
1978	గుంటూరు బాపనయ్య	సీపీఐ	కలపాల నాంచారయ్య	కాంగ్రెస్
1979 (ఉ.ఎ)	గుంటూరు ధనసూర్యవతి	సీపీఐ	డీఎం రంగారావు	స్వతంత్ర
1983	గోవాడ మల్లిఖార్జునరావు	టీడీపీ	కోనేరు రంగారావు	కాంగ్రెస్
1985	పాటూరు రామయ్య	సీపీఎం	మునిపల్లి వినయబాబు	కాంగ్రెస్
1989	పాటూరు రామయ్య	సీపీఎం	మునిపల్లి వినయబాబు	స్వతంత్ర
1994	పాటూరు రామయ్య	సీపీఎం	మునిపల్లి వినయబాబు	స్వతంత్ర
1999	గోవాడ మరియకుమారి	టీడీపీ	పెనుమత్స జయరాజు	కాంగ్రెస్
2004	పాటూరు రామయ్య	సీపీఎం	ఉప్పులేటి కల్పన	టీడీపీ





సైకిల్ ఎత్తా.. విజేతగా నిలుస్తా..

- విజయవాడలో గద్దె రామ్మోహన్ వినూత్న ప్రచారం
- గుడివాడలో నుదిటిపై బ్యాండేజీతో వెనిగండ్ల, రావి

ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు వినూత్న ప్రచారానికి సిద్ధమవుతున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు తన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ కార్యకర్తల జయజయధ్వానాల మధ్య తెలుగుదేశం పార్టీ ఎన్నికల గుర్తు అయిన సైకిల్‌ను ఒంటి చెత్తో పైకెత్తి మన ఎన్నికల గుర్తు సైకిల్ అంటూ ఓట్లు అభ్యర్థించారు. మరో వైపు గుడివాడ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెనిగండ్ల రాము సైతం తన ప్రచారాన్ని వినూత్నంగా నిర్వహిస్తున్నారు. సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలిసి గుడ్లవల్లేరు మండలం శేరికల్వపూడిలో ప్రచారం చేస్తున్నారు. ఇటీవల సీఎం జగన్ తనపై జరిగిన గులకరాయి దాడిని హైలెట్ చేస్తూ చాలా రోజులు బ్యాండేజీతో ప్రచారం చేశారు. ఈ దాడి అంతా వైసీపీ ఎన్నికల స్టంట్ అంటూ సీఎం చర్యలను ఎత్తిచూపుతూ, ఎద్దేవా చేస్తూ వెనిగండ్ల, రావి తమ నుదిటిపై బ్యాండేజీలు అంటించుకుని వినూత్నంగా ప్రచారం చేశారు. అంతే కాక వారితో పాటు పాల్గొన్న నేతలు, కార్యకర్తలు సైతం నుదిటిపై బ్యాండేజీలతో ప్రచారం చేశారు. మార్గ మధ్యంలో అలసిపోయి షోడా తాగుతూ అక్కడ కూడా కార్యకర్తలను ఉత్సాహ పరుస్తూ ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తూ ముందుకు సాగిపోతున్నారు. - విజయవాడ/గుడ్లవల్లేరు.





తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు స్వగ్రామం పామర్రు నియోజకవర్గంలో ఉండటంతో ఇక్కడ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రతిష్టాత్మకంగానే జరుగుతుంటాయి. ఈ నియోజకవర్గం నుంచి టీడీపీ ఒకసారి మాత్రమే గెలుపొందగా వైసీపీ మాత్రం రెండుసార్లు గెలుపొందింది. ఇక్కడి నుంచి గెలుపొందేవారు మాత్రం స్థానికులు కాదు. పైగా వారు ఎన్నిసార్లు పోటీ చేసినా ఒక్కసారి మాత్రమే ఇక్కడి ప్రజలు గెలిపిస్తూ వచ్చారు. గతంలో పామర్రు మండలం గుడివాడ, నిడుమోలు నియోజవర్గాలతో కలిసి ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నిడుమోలు, ఉయ్యూరు నియోజకవర్గాల్లోని మొవ్వ, పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాలతోపాటు గుడివాడలోని పెదపారుపూడి మండలాన్ని కూడా కలుపుకుని ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా పురుడు పోసుకుంది. - మచిలీపట్నం/పామర్రు

టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ పుట్టిన ప్రాంతం



పామర్రులో పాగా వేసేదెవరో..?

నియోజకవర్గం ఎమ్మెల్యేగా వలసదారులకే పట్టం | **ఇప్పటికి మూడు పర్యాయాలు ఎన్నికలు** | **విభిన్నమైన తీర్పునిస్తున్న ఓటర్లు**

2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి ఆ పార్టీ సీనియర్ నేత, పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య కుమారుడు వర్ల కుమార్ రాజా తొలిసారి ఎన్నికల బరిలో నిలిచారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన ఆయన చేసిన పోరాటాలు టీడీపీ అధినేత గుర్తించి కుమార్‌రాజాకు టీడీపీ టికెట్‌ను కేటాయించారు. పల్లె నిద్ర పేరుతో అన్ని గ్రామాల్లోనూ ఆయన పర్యటించడంతో ఎక్కడ లేని మైలేజీ వచ్చింది. అంతేకాక జనసైనికులతోనూ సఖ్యతగా మెలగడం కలిసివచ్చే అంశం. ఐదేళ్లుగా వైసీపీ ఎమ్మెల్యే చేసిన అవినీతి అక్రమాలు తన గెలుపునకు బాటలు వేస్తాయనే నమ్మకంతో ఉన్నారు. మరోవైపు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మరోసారి వైసీపీ తరుఫున ఎన్నికల బరిలో నిల్చున్నారు. ఆయన శైలే వేరు. చెప్పేదొకటి, చేసేదొకటి. కృష్ణానది తీరాన ఉన్న పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాల వెంబడి ఉన్న ఇసుకను పెద్ద ఎత్తున తవ్వి, తరలించి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారని, పేదలకు ఇళ్లస్థలాల పేరుతో తక్కువ ధరకు భూమిని కొని రెండింతల అధిక ధరకు ప్రభుత్వానికి విక్రయించారనే ఆరోపణలున్నాయి. ఈ అంశం హైకోర్టులో ఉండటంతో ఇళ్లస్థలాల పంపిణీ నిలిచిపోయింది. అభివృద్ధిని పక్కనపెట్టి తన అనుచరుల ద్వారా ప్రతిపనికీ రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడ్డారని విమర్శలు వచ్చాయి. అధికారులతో అడ్డగోలుగా పనులు చేయించుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయకపోతే అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఇబ్బందుల పెడతారనే అపప్రదను మూటగట్టుకున్నారు. మహిళా అధికారులతో అసభ్యంగా మాట్లాడటం, నచ్చని అధికారులను బదిలీ చేయించడం ఈయన నైజం, పదవీ విరమణ చేసిన ఒక జిల్లా న్యాయమూర్తికి చెందిన భూమిని వైసీపీకి అనుకూలురు రెవెన్యూ సిబ్బంది సహకారంతో ఆక్రమిస్తే సదరు ఎమ్మెల్యే ఆక్రమణదారులకే కొమ్ముకాయడం గమనార్హం. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే డీవై దాసు మరోసారి పోటీ చేస్తున్నారు. గతంలో తాను చేసిన అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




డీవై దాసు



ఉప్పులేటి కల్పన

ఇదీ నియోజకవర్గ చరిత్ర

పామర్రు నియోజకవర్గం (ఎస్సీ)లో 1,83,158 మంది ఓటర్లున్నారు. వీరిలో పురుష ఓటర్లు, 88,815 మహిళా ఓటరు 94,340, ఇతర ఓటర్లు ముగ్గురున్నారు. ఈ నియోజకవర్గం 592.38 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. 43,818 హెక్టార్ల భూమి ఉంది. లంక, నదీతీరం వెంబడి గ్రామాల్లో వరితోపాటు చెరకు, ఇతర వాణిజ్య పంటలు అధికంగా సాగవుతుంటాయి. ఇక్కడ తొలి శాసనసభ్యుడిగా దివిసీమకు చెందిన దోవారి ఏసుదాస్ (డీవైదాస్) కాంగ్రెస్ నుంచి అప్పటి టీడీపీ అభ్యర్థి ఉప్పులేటి కల్పనపై 10వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వర్ల రామయ్యపై 942 ఓట్ల ఆధిక్యతతో ఉప్పులేటి కల్పన వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2017లో ఆమె తిరిగి టీడీపీలోకి చేరారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఉప్పులేటి కల్పనపై గన్నవరం నియోజకవర్గానికి చెందిన వలసదారుడు కైలే అనిల్ కుమార్ 30వేలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలిపొందారు. నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ఓటర్లు వలసదారులకే పట్టం కడుతూ వస్తున్నారు. అదికూడా ఒక్కసారి మాత్రమే కావడం గమనార్హం.



ఎందరో మహానుభావులు..

సినిమారంగంలో రాణించి శ్రీకృష్ణుడు, రాముడంటే ఇలాగే ఉంటారేమోనని భావించేలా చేసి, కాగ్రెస్‌పార్టీకి తిరుగులేని రోజుల్లో తెలుగుదేశం పార్టీని స్థాపించి ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల దశ, దిశను మార్చివేసి ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి ఆత్మగౌరవానికి నూతన అరర్థం చెప్పిన నందమూరి తారకరామారావు సొంత ఊరు నిమ్మకూరు పామర్రు నియోజకవర్గంలోనే ఉంది. భారత జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా పనిచేసిన కాకి మాధవరావు, రంగస్థల కళాకారులులైన రాళ్లబండి కామేశ్వరరావు, సాక్షి రంగారావు, తమ్మారెడ్డి చలపతిరావు, చంద్రమోహన్, సినీ నిర్మాతలు భీమవరపు బుచ్చిరెడ్డి, ఉప్పలపాటి సూర్యనారాయణ, చలసాని గోపి ఈప్రాంతం వారే. స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరిలూదిన ఆంధ్రపత్రిక సంపాదకుడు దేశోద్ధార కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుతోపాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ జాస్తి చలమేశ్వరరావు, జిల్లా జడ్జి పనిచేసిన తమ్మా కోటమ్మారెడ్డి లంటి వారి పురిటి గడ్డ కూడా ఇదే కావడం విశేషం. తెలుగువారి సంస్కృతీ, సంప్రదాయాలను, ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన కూచిపూడి నాట్యం ఇక్కడే పురుడు పోసుకుంది.

అభివృద్ధికి ఆమడదూరం

పదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శూన్య. ముఖ్యంగా పామర్రు పట్టణాభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు తయారైంది. పెదపారుపూడి, గుడివాడలోని కొన్ని ప్రాంతాలకు. కృష్ణానదీ నుంచి తాగునీటిని అందించేందుకు రూపొందించిన మంచినీటి పథకం పనులు నిలిచిపోయాయి. తోట్లవల్లూరు మండలంలో పాముల్లంక వంతెన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం పక్కనపెట్టింది. నియోజకవర్గ కేంద్రంలో ఇండోర్‌స్టేడియం పనులు నిలిచిపోయాయి. మండలాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి ఈ ఐదేళ్లలో జరగనేలేదు. ఇక్కడ ఎక్కువ శాతం వ్యవసాయంపైనే రైతులు ఆధారపడి ఉన్నారు. వారికవసరమైన ఇబ్బందులు తొలగించడంలో ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. కాల్వల మరమ్మతులు లేక వర్షాకాలంలో ముంపునకు గురై రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధులు సక్రమంగా అందక సీహెచ్‌సీ ఆధునీకరణ నిలిచిపోయి వైద్యారోగ్య సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కోసం ఒక ఐటీ హబ్, విద్యార్థుల కోసం ఇంజినీరింగ్ కళాశాల, మహిళలకు స్వయం సంవృద్ధి కేంద్రాల ఏర్పాటు వంటివి ఈ నియోజకవర్గానికి రావాల్సి ఉంది.



ఓటు విలువ తెలుసుకో..

'ఓటు మన హక్కు- ఓటువేద్దాం మే 13- 69 తిరువూరు' ఆకారంలో కూర్చొని ఎన్నికల సిబ్బంది నిర్వహించిన ప్రదర్శన జిల్లాలో చర్చనీయాంశం అయింది. ఓటు విలువను తెలిపేందుకు ఇటువంటి వినూత్న పద్ధతిని ఎంచుకోవడంపై స్థానికులు ఎన్నికల సిబ్బందిని అభినందిస్తున్నారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాలకు చెందిన ఎన్నికల సిబ్బందికి స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో ఆర్డీఓ కె.మాధవి నిర్వహించిన ఓటర్ల అవగాహన సదస్సులో పాల్గొన్న అనంతరం ఈ ప్రదర్శన నిర్వహించారు. - తిరువూరు.



ఆయనెప్పుడూ అంతే..!

- సీటు నాదే అంటారు... చివరకు పోటీలో ఉండరు

అవనిగడ్డ రూరల్: ఎన్నికలు వచ్చినప్పుడల్లా అవనిగడ్డ అసెంబ్లీ టికెట్ తనదేనని ప్రకటిస్తారు తోట శ్యామ్ కిషోర్ నాయుడు. పేద ప్రజలకు, అనారోగ్యంతో బాధపడే వారికి అండగా ఉండే వ్యక్తి. 15 ఏళ్లుగా అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా టిక్కెట్ తనదేనంటూ ముందే ప్రచారం చేస్తుంటారు. తనకు 60శాతం ఓటింగ్ ఉందని, మిగిలిన వారికి 20, 30 శాతమే ఉంటుందని చెప్పుకుంటుంటారు. ఇంటి చుట్టూ వాస్తును సరిచేసుకోవడం, ఈసారి తన దశ మారిపోతుందని చెప్పుకోవడం, చివరికి ఏ పార్టీ ముందుకొచ్చి టిక్కెట్ ఇవ్వకపోవడం పరిపాటిగా మారుతోంది. ఈ ఎన్నికల్లోనూ అదే జరిగింది. ఇటీవల వరకు అసెంబ్లీ టిక్కెట్ తనదేనని చెప్పిన శ్యామ్ కిషోర్ నాయుడు పేరును ఏ పార్టీ ప్రకటించకపోవడంతో జనం ఆయన్ను జాలిగా చూస్తున్నారు.

బలహీన వర్గాలకు 'పెద్ద'సింగు

- క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లక్ష్మణరావు
- మచిలీపట్నం నుంచి 3సార్లు ఎమ్మెల్యే
- ఆయన పేరిటే లక్ష్మణరావు పురం ఏర్పాటు



మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం అసెంబ్లీ నియోజక వర్గానికి బలహీన వర్గాల నుంచి 3 సార్లు వరసగా ఎన్నికైన శాసనసభ్యుడు పెదసింగు లక్ష్మణరావు. 1922 నవంబరు 14న పెదసింగు వెంకట రంగయ్య మంగతాయారు దంపతులకు మచిలీపట్నంలో జన్మించారు. తండ్రి వెంకట రంగయ్య 1932లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ఎమ్మెల్సీగా పనిచేశారు. ఇలా తండ్రి నుంచి రాజకీయాలు వారసత్వంగా వచ్చాయి. దేశభక్తి కలిగిన లక్ష్మణరావు 1942లో స్వాతంత్రోద్యమంలో పాల్గొని 3 నెలలపాటు జైలుకు వెళ్లారు. అక్కడ కలిసిన టంగుటూరి ప్రకాశం పంతులుకు సన్నిహితులయ్యారు. మత్స్యకారుల్లో ధనవంతుల కుటుంబంలో జన్మించిన లక్ష్మణరావు జైలుకు వెళ్లడం అప్పట్లో బలహీన వర్గాల్లో ఆలోచన రేకెత్తించింది. తండ్రి వెంకటరంగయ్య నౌకా వ్యాపారం చేసేవారు. అలా మచిలీపట్నం ప్రజలకు పరిచయమైన లక్ష్మణరావు 1962లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. తరువాత వరుసగా రెండు సార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు, ఇలా 1967లోను, 1972లోను పోటీ చేసి అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. ఇలా 1962 నుంచి 1978 వరకు 15 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా ఆయన మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి సేవలందించారు. బలహీన వర్గాలకు పలు ప్రాంతాల్లో కలెక్టరుతో సిఫార్సు చేసి ఇళ్లస్థలాలు ఇప్పించారు. ఇందుకుగాను వీరి పేరుతో లక్ష్మణరావుపురం ఏర్పాటు చేశారు. లంబాడీలకు, వడ్డెరలకు ఇళ్లస్థలాలిచ్చారు. రిక్షాకార్మిక సంఘానికి అధ్యక్షుడిగా ఉండి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేశారు. 1956 నుంచి వీరు అగ్నికుల క్షత్రియుల రాష్ట్ర సంఘ అధ్యక్షుడిగా సేవలందించారు. ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల హక్కుల రక్షణ సమితిని నెలకొల్పి మత్స్యకారుల పరిరక్షణకు కృషి చేశారు. వేటకు వెళ్లే మత్స్యకారుల సంక్షేమానికి కృషిచేసిన ఎమ్మెల్యేలలో లక్ష్మణరావు ఆద్యుడుగా మిగిలిపోయారు. అనంతరామన్ కమిషన్ సభ్యుడిగా ఉండి రాష్ట్రమంతా మత్స్యకారుల హక్కుల కోసం పోరాడారు. మత్స్యకారులను బీసీ-ఏగా గుర్తించేందుకు కృషిచేశారు. ఒక దశలో మత్స్యకారులను ఎస్సీల్లో చేర్చాలని పోరాటం కూడా చేశారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ మత్స్యకారుల సమస్యలపై అసెంబ్లీ ఎదుట ధర్నాలు చేశారు. మత్స్యకారుల సొసైటీలు ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషి చేశారు. పేద మత్స్యకారులకు పెద్ద ఎత్తున భూములు పంపిణీ చేశారు. 1996 ఏప్రిల్ 21న లక్ష్మణరావు కన్నుమూశారు. వీరి సేవలకు గుర్తుగా మచిలీపట్నం కోనేరుసెంటర్‌లో పెదసింగు లక్ష్మణరావు విగ్రహాన్ని నెలకొల్పారు. తరువాత మళ్లీ అగ్నికులక్షత్రియకు చెందిన నడకుదిటి నరసింహారావు, కొల్లు రవీంద్ర శాసన సభకు ఎన్నికై మంత్రి పదవులు చేపట్టారు.



హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మకు రూ.1.91కోట్లకు పైగా కానుకలు

వన్‌టౌన్, ఏప్రిల్ 30 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో మంగళవారం 15 రోజుల వ్యవధికి సంబంధించి ఆలయ మహామండపం ఆరో అంతస్తులో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించారు. రూ.1,91,27,261ల నగదు, 370 గ్రాముల బంగారం, 3కిలోల 850 గ్రాముల వెండి కానుకల రూపేణా సమకూరాయి. వీటితో పాటు యూఎస్‌ఏ డాలర్లు 516, ఓమన్ బైంసాలు 100, యూకే పౌండ్లు 80, ఇంగ్లాడ్ పౌండ్లు 40, ఆస్ట్రేలియా డాలర్లు 100, కెనడా డాలర్లు 15, 5 యూరోలు, 2 సింగపూర్ డాలర్లు, 25 యునైటెడ్ అరబ్ ఎమరేట్స్ దిర్హమ్స్, ఒక కువైట్ దినార్, 24 ఖతార్ రియాల్స్, 1000 కొరియా వాన్‌లు వచ్చాయి. ఆన్‌లైన్ ఈ-హుండీ ద్వారా రూ.44,831లు కానుకగా వచ్చాయి. ఈవో కేఎస్ రామారావుతో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది, ఎస్‌పీఎఫ్, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, భవానీ సేవాదారులు తదితరులు కానుకల లెక్కింపులో పాల్గొన్నారు.

అన్నివర్గాలను సంతృప్త పరిచేలా మేనిఫెస్టో



▸▸ నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 30 : జగన్ అరాచక, విధ్వంసక, సైకో పాలనతో తీవ్ర గాయాల పాలైన రాష్ట్రానికి టీడీపీ కూటమి మేనిఫెస్టో గాయాలు మాన్పించేలా, అన్ని వర్గాలను మెప్పించేలా ఉందని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అన్నారు. మెగా డీఎస్సీపై చంద్రబాబు తొలిసంతకంతో దగా పడ్డ విద్యార్థి, నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు తెస్తుందని, ఫించన్లను రూ.4వేలకు పెంచటం, దుర్మార్గపు, చీకటి చట్టమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తానన్న హామీపై హర్షం వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని అమలు చేసి చూపించి రాష్ట్రంలో సంపద పెంచి ఇటు సంక్షేమాన్ని, అభివృద్ధిని పుంతలు తొక్కించేలా ఉందన్నారు.

మేనిఫెస్టోతో వైసీపీ నేతల్లో వణుకు : కొల్లు రవీంద్ర



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 : టీడీపీ కూటమి మేనిఫెస్టో చూసి వైసీపీ నేతల్లో వణుకు మొదలైందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మచిలీపట్నం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, టీడీపీ హయాంలో పేదప్రజలకు అండగా ఉన్న అన్నా క్యాంటీన్ వంటి పథకాలను వైసీపీ రద్దు చేసిందని, ఈ పథకాలను పునరుద్ధరిస్తామని ఉమ్మడి మేనిఫెస్టోలో చంద్రబాబు పేర్కొనడంతో వైసీపీ నేతల గుండెల్లో దడ పుట్టుకొచ్చిందన్నారు. ప్రతీ ఏటా జాబ్ కేలండర్ ప్రకటిస్తానని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదన్నారు. అధికారంలోకి రాగానే తొలి సంతకం డీఎస్సీదని చెప్పడంతో నిరుద్యోగులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మహిళలకు మూడు వంటగ్యాస్ సిలెండర్లు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500 వంటి పథకాలతో వారి ముఖాల్లో ఆనందం కనబడుతోందన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పించను ఇస్తానని చెప్పిన మాట నిలబెట్టుకుని మేనిఫెస్టోలో చేర్చారన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు రెండు సెంట్ల స్థలం ఇస్తామన్నారు. టీడీపీ హయాంలో పండుగలకు ఇచ్చిన కానుకల పథకాలు తిరిగి పునరుద్ధరిస్తామన్నారు. ఉమ్మడి మేనిఫెస్టో అందరికీ అనుకూలంగా ఉంటే బందరు ఎమ్మెల్యే విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ మేనిఫెస్టో ప్రజలను ఆకర్షించలేదని, అంకెల గారడీ అని అందరికీ తెలిసి పోయిందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్, వల్లపాటి సుబ్రహ్మణ్యం, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ప్రచారంలో ఉన్న టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతున్న వైసీపీ మూకలు

టీడీపీ నేతలపై అక్రమ కేసులు!

▸▸ వసంత ఎన్నికల ప్రచార ర్యాలీలో వైసీపీ నేతల హల్‌చల్

▸▸ అక్రమ కేసుల సంస్కృతి వారికి కొత్త కాదు : వసంత

ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, ఏప్రిల్ 30 : కొటికలపూడి గ్రామంలో మైలవరం కూటమి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఎన్నికల ప్రచారానికి వస్తున్న అనూహ్య స్పందన చూసి వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. సోమవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు బాణాసంచా కాల్చుతుండగా అడ్డుకుని రోడ్డుపై విసిరివేశారు. ఈక్రమంలో వైసీపీ కార్యకర్తలకు స్వల్ప గాయాలు కాగా.. ఇదంతా వసంతే చేయించాడని ఆరోపిస్తూ మూలపాడుకు చెందిన వైసీపీ నేత కార్యకర్తలతో స్టేషన్‌కు వెళ్లి టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించాడు. అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకు పోలీసులు వసంతతో పాటు మరో తొమ్మిది మంది టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేశారు. వైసీపీ నేతలు పథకం ప్రకారం టీడీపీ ఎన్నికల ప్రచారంలో అల్లర్లు సృష్టించడమే కాక చర్చిలో ప్రార్థనలకు వెళ్లకుండా తాళాలు వేయించినట్టు టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వారు కోరుతున్నారు.

అక్రమ కేసులు వారికి కొత్త కాదు..

అక్రమ కేసుల సంస్కృతి వాళ్లకి కొత్తేమి కాదని మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణ ప్రసాద్ అన్నారు. కొటికలపూడి గ్రామంలో ర్యాలీలో జరిగిన ఘటనలో తనను మొదటి ముద్దాయిగా చేర్చి కేసు పెట్టించారని, అరకిలో మీటర్ దూరంలో వాహనంపై ఓట్లు అభ్యర్థిస్తుంటే నేను చేయమన్నానని నెపం మోపారన్నారు. అర్ధరాత్రి నాపై కేసు పెట్టింది చాలక తన కంపెనీ నుంచి రెండు వేలమంది వచ్చారని అభాండాలు వేస్తున్నారని, తన కంపెనీలో 200 మంది ఉద్యోగులే ఉన్నారన్నారు. మైలవరంలో పోటీ పెట్టిన వ్యక్తిపై జగన్ ఆయన సామాజిక వర్గానికి చెందిన అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి, హర్షా రెడ్డి, తిరుపతిరెడ్డి అనే ముగ్గురితో పాటు కడప, కర్నూలు నుంచి 80 మందిని రప్పించి ప్రతి నాయకుడిపై పెత్తందారిగా పెట్టారన్నారు. నాపై కేసులు పెట్టుకోండి.. ఏం జరుగుతుందో ప్రజలే నిర్ణయిస్తారన్నారు.



మాచవరంలో బుద్ధప్రసాద్ ఎన్నికల ప్రచారం

వైసీపీ దుర్మార్గ పాలన అంతం కావాలి.. : మండలి

కోడూరు, ఏప్రిల్ 30 : వైసీపీ దుర్మార్గపాలన అంతానికి సమయం ఆసన్నమైందని అవనిగడ్డ ఎన్డీఏ కూటమి అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కోడూరు మండల పరిధిలోని మాచవరం గ్రామం నుంచి వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, పిట్టల్లంక, సాలెంపాలెం, వేణుగోపాలపురం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు డప్పు వాయిద్యాలతో మండలికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండలి మాట్లాడుతూ, ప్రజలందరూ దివిసీమ ప్రాంతాన్ని అభివృద్ధిపర్చింది ఎవరో అని గుర్తు చేసుకుని గాజు గ్లాసు గుర్తుపై రెండుఓట్లు వేసి తనను, వల్లభనేని బాలశౌరిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, ఒడుగు నాగబాబు, చిలకలపూడి పాపారావు, పి.ఎస్.రావు, కూరాకుల ప్రసాద్, పూతబోయిన శ్రీనివాసరావు, కోట కరుణ్ కుమార్ తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా విశ్వనాథపల్లి గ్రామానికి వెళ్లిన మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో విశ్వనాథపల్లి సచివాలయ కన్వీనర్ విశ్వనాథపల్లి హరిబాబు జనసేన పార్టీలో చేరారు.

878 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకం



▸▸ ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 47 శాతం పైగా గుర్తింపు

▸▸ ఎన్నికల సంఘానికి నివేదించిన జిల్లా యంత్రాంగం

▸▸ అత్యధికంగా విజయవాడ తూర్పులో 159

▸▸ అత్యల్పంగా నందిగామలో 77

▸▸ భద్రత పెంచేందుకు బలగాలు కోరిన జిల్లా యంత్రాంగం

▸▸ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో.. వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

నవ ఎన్టీఆర్ జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఆందోళనకలిగిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 47శాతం పైగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల సంఘానికి, జిల్లా ఎన్నికల యంత్రాంగం నివేదించింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1874 పోలింగ్ స్టేషన్లలో 878 వరకు సమస్యాత్మకంగా ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 720 లోకేషన్లలో ఒకటి నుంచి 15 వరకు కూడా పోలింగ్ స్టేషన్లు ఉంటాయి. ఈ లెక్కన మొత్తం 332 పోలింగ్ లోకేషన్లు సమస్యాత్మకంగా ఉన్నాయని జిల్లా ఎన్నికల యంత్రాంగం గుర్తించింది. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల లోకేషన్ల ఆధారంగా చూస్తే 46.11 శాతం మేర సమస్యాత్మకంగా ఉన్నాయని గుర్తించటం జరిగింది. గత సార్వత్రిక ఎన్నికల్లో చోటు చేసుకున్న వివాదాలు, అల్లర్లు, పోలింగ్ ప్రక్రియకు విఘాతం కలగటం, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అనుచరుల పరస్పర కవ్వింపులు అన్నింటినీ గమనంలోకి తీసుకుని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా గుర్తించారు. ప్రధానంగా 2009, 2014, 2019లలో చోటు చేసుకున్న గొడవలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎన్నికల యంత్రాం గం గట్టి బందోబస్తుకు బలగాల కోసం ఇప్పటికే పోలీసు యంత్రాంగానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదించింది.

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఇవే..

జిల్లావ్యాప్తంగా 720 లోకేషన్లలో 1874 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తీవ్ర హింసాత్మక పోలింగ్ కేంద్రాలు లేకపోయినా.. సమస్యాత్మక కేంద్రాలు 878 వరకు ఉన్నాయని గుర్తించారు. వీటిలో అత్యధికంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 159, సెంట్రల్ నియోజకవర్గంలో 134, తిరువూరులో 129, మైలవరం నియోజకవర్గంలో 124, జగ్గయ్యపేటలో 116, విజయవాడ పశ్చిమలో 97, నందిగామలో 77 పోలింగ్ స్టేషన్లు సమస్యాత్మకంగా ఉన్నాయని గుర్తించారు.

గన్నవరం అత్యంత సమస్యాత్మకం..

కృష్ణాజిల్లా పరిధిలోకి వచ్చే గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలం పరిధిలోని కొన్ని గ్రామాలు ఎన్టీఆర్ జిల్లాలో అంతర్భాగంగా ఉంటాయి. విజయవాడ రూరల్ మండల పరిధిలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, నున్న, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి, నైనవరం, పాతపాడు, గొల్లపూడి వంటి గ్రామాలలో ఎన్నికల నిర్వహణ బాధ్యత ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగంపైనే ఆధారపడి ఉంది. ఈ ప్రాంతాల్లో కొన్ని మైలవరం నియోజకవర్గ పరిధిలోకి, కొన్ని గన్నవరం నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. మైలవరం నియోజకవర్గం ఎన్టీఆర్ జిల్లాకు చెందింది కాబట్టి వీటి కౌంటింగ్ అంతా ఇక్కడే నిర్వహిస్తారు. గన్నవరం నియోజకవర్గానికి చెందిన గ్రామాలకు సంబంధించి కృష్ణాజిల్లాలో లెక్కింపు జరుగుతుంది. ఎన్నికల నిర్వహణ మాత్రం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగమే చూసుకోవాల్సి ఉంటుంది. గత ఎన్నికలలో ప్రసాదంపాడులో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. రామవరప్పాడు, ఎనికేపాడు, నిడమానూరు, నున్న, కొత్తూరు తాడేపల్లి వంటి ప్రాంతాలలో గొడవలకు ఆవకాశాలు కనిపిస్తున్నాయి. స్థానికంగా ఉన్న రాజకీయ పరిస్థితులు, పరస్పరం రెచ్చగొట్టుకుంటున్న తీరు, బల సమీకరణలతో పోటీకి ముందే గన్నవరంలో ఒక రకమైన యుద్ధ వాతావరణం నెలకొంది. ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగాన్ని ఈ పరిణామాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ పోలింగ్ కేంద్రాలపైనా సీరియస్‌గా దృష్టి సారించాలని నిర్ణయించటం జరిగింది.

సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్

జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లంటిలోనూ వెబ్ క్యాస్టింగ్ నిర్వహించాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం నిర్ణయించింది. సాంకేతిక కన్ను ఈ సమస్యాత్మక కేంద్రాల మీద పర్యవేక్షణ చేస్తోంది. మొత్తం 913 పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తారు. ఈ పోలింగ్ కేంద్రాలలో ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారంలో లైవ్‌గా ఆయా స్టేషన్ల స్థితిగతులను గమనిస్తూ ఉంటారు. దీంతో పాటు పోలింగ్ కేంద్రాల ఆవరణ, చుట్టుపక్కల, 100 మీటర్ల దూరం నుంచి పోలింగ్ కేంద్రాల సమీపం వరకు వీడియోగ్రఫీ కూడా చేయించాలని నిర్ణయించారు. గుర్తించిన 430 పోలింగ్ స్టేషన్లలో వీడియోగ్రఫీ చేయిస్తున్నారు.

తొలి దశ అడ్మిషన్‌కు 600 మంది విద్యార్థుల ఎంపిక

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 : ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న కృష్ణాజిల్లా విద్యార్థులకు తొలి దశ అడ్మిషన్‌లో 697 మందిని ఎంపిక చేసినట్టు డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. మంగళవారం డీఈవో మాట్లాడుతూ, ఎస్సీ కేటగిరిలో 309, ఎస్టీ కేటగిరిలో 16, బీసీ 253, మైనారిటీ 34, ఓసీ కేటగిరిలో 88 మంది పిల్లలు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు అడ్మిషన్ ప్రక్రియ బుధవారం నుంచి మే 10వరకు నిర్వహిస్తారన్నారు. మండలస్థాయిలో మే 11న ఎంఈవోలకు ఏవైనా అభ్యంతరాలుంటే తెలపవచ్చన్నారు. ఎంఈవోలు 14వ తేదీన ఫిర్యాదుల జాబితా తెలపాలన్నారు. డీఈవో ఆ ఫిర్యాదులను మే 15న ఎస్‌పిడికి తెలియచేస్తారన్నారు. 16, 17 తేదీల్లో సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులను పరిష్కరిస్తారన్నారు.

అమరావతి రాజధానిగా కొనసాగాలంటే ..

ఎన్డీఏ అధికారంలోకి రావాలి



▸▸ మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు

నందిగామ, ఏప్రిల్ 30 : అమరావతి రాజధానిగా కొనసాగాలంటే ఎన్డీఏ అధికారంలోకి రావాలని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఐతవరంలోని తన నివాసంలో అమరావతి జేఏసీ నేత పోతుల బాలకోటయ్య, రాష్ట్ర బీసీ నాయకురాలు యలగాని నూకానమ్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం కోసం భూములు త్యాగం చేసిన అమరావతి రైతులను మోసం చేస్తూ జగన్ రాజధాని మార్పుకు ముందుకు వచ్చాడన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన వ్యక్తిగత ప్రయోజనాలే లక్ష్యంగా జగన్ పని చేస్తున్నాడని ఆరోపించారు. అమరావతి రాజధానిని నాశనం చేసిన జగన్ అధికారంలోకి వస్తే విశాఖ నుంచి పాలిస్తానని ప్రకటించడం దారుణమన్నారు. ప్రజలు ఈ అంశాలను పరిగణంలోకి తీసుకొని ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే అమరావతి నిర్మాణం పూర్తవుతుందని, ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. చంద్రబాబు వంటి మేధావి పాలన ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా మ్యానిఫేస్టో విడుదల చేసిన కూటమి నేతలకు ఆయన అభినందనలు తెలిపారు. పోతుల బాలకోటయ్య, యలగాని నూకానమ్మలు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి మ్యానిఫేస్టోలో మంచి ప్రాధాన్యత దక్కిందన్నారు.

గుడివాడను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

▸▸ ఎన్నికల ప్రచారంలో వల్లభనేని బాలశౌరి, వెనిగండ్ల రాము హామీ

గుడివాడ, ఏప్రిల్ 30 : గుడివాడను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని, ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పథంలో నడిపిస్తామని మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ కూటమి టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ప్రజలకు హామీ యిచ్చారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి వారు మాట్లాడుతూ, అభివృద్ధి అంటే పట్టని, గిట్టని వైసీపీ నేతలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. జగన్, నానిలకు ఓట్లు యావ తప్ప, ప్రజల గోడు పట్టదని, సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నేతలు దింట్యాల రాంబాబు, యలవర్తి శ్రీనివాసరావు, పిన్నమనేని బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో గ్లాస్ చూపుతున్న బాలశౌరి, వెనిగండ్ల, రావి

వెనిగండ్ల సమక్షంలో టీడీపీలోకి చేరికలు

పలువురు వైసీపీ కార్యకర్తలు వెనిగండ్ల రాము సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే కొడాలి నానికి అత్యంత సన్నిహితుడు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ సభ్యుడు, బీసీ నేత కిలారపు రంగప్రసాద్ వెనిగండ్ల సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. వెనిగండ్ల, బాలశౌరిల సమక్షంలో రైలుపేటకు చెందిన మహిళలు, యువత టీడీపీలో చేరారు. స్థానిక 25వ వార్డుకు చెందిన వడ్డెర కులస్థులు 150మంది టీడీపీలో చేరారు. జనసేన జిల్లా నాయకులు పాలంకి సారదిబాబు, వార్డు ఇన్‌చార్జ్ దారపురెడ్డి శేషు, మైనార్టీ నాయకులు షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు సర్వం సిద్ధం చేయండి

▸▸ మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్

వన్‌టౌన్, ఏప్రిల్ 30 : హజ్ యాత్ర విజయవంతానికి కేంద్ర, రాష్ట్ర శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి హర్షవర్ధన్ అన్నారు. హజ్-2024 యాత్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో సన్నద్ధత సమావేశం మంగళవారం వన్‌టౌన్‌లోని షాదీఖానాలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హజ్ యాత్రకు ఈ ఏడాది కోటా 2,902 మందికి గాను ఇప్పటివరకు 2,580 మంది నమోదు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 720 మంది, హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1118 మంది, బెంగుళూరు ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 720 మంది, చెన్నై ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 9 మంది యాత్రకు బయలుదేరనున్నట్టు వివరించారు. హజ్ యాత్రీకులు ఆయా ఎంబార్కేషన్ పాయింట్‌ల నుంచి మే 26 నుంచి జూన్ 9వ తేదీ మధ్య బయలుదేరతారని తెలిపారు. సుమారు 38 నుంచి 42 రోజుల యాత్ర ముగించుకుని జూలై 1 నుంచి 21వ తేదీ లోగా తిరిగి విజయవాడ చేరుకుంటారని తెలిపారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి యాత్రీకుల ప్రయాణానికి స్పైస్‌జెట్ సేవలు అందించడానికి ముందుకు వచ్చినట్టు తెలిపారు. హజ్ యాత్రీకుల సౌకర్యార్థం గన్నవరం ఎయిర్‌పోర్ట్ సమీపంలోని మదర్సాలో బస ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. హజ్ యాత్రికులకు సుమారు 40 రోజుల పర్యటనకు మాత్రమే అనుమతి ఉందని అంతకంటే ఎక్కువ రోజులకు అనుమతి లేదని ఆయన వివరించారు. హ్యాండ్‌బ్యాగ్ లగేజీ కింద 8 కేజీల బ్యాగు, చెక్ ఇన్ లగేజీ కింద 20 కేజీల బరువున్న రెండు బ్యాగులకు అనుమతి ఉందని తెలిపారు. ఎస్‌బీఐ బ్యాంకు తమ శాఖ తాత్కాలిక సెంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒక్కొక్క యాత్రీకునికి సుమారు రూ.4లక్షల వరకు ఫారిన్ ఎక్స్ఛేంజ్ అందిస్తున్నట్టు తెలిపారు. సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ షేక్ హలీం బాషా, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారి లక్ష్మీకాంతరెడ్డి, హజ్ కమిటీ స్టేట్ సభ్యులు, ఏపీ హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎల్.అబ్దుల్ ఖాదర్, ఎస్‌బీఐ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.నాగవేణి, డిప్యూటీ జనరల్ మేనేజర్ మనీష్ కుమార్, ఆయా విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

▸▸ కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని, ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఎన్నికల పరిశీలకులతో కలిసి కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నామినేషన్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి 15మంది, గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 12, గుడివాడ 12, పెడన 10, మచిలీపట్నం 14, అవనిగడ్డ 12, పామర్రు 8, పెనమలూరు నియోజకవర్గంలో 11 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు తెలిపారు. జిల్లాలో ఈనెల 25వ తేదీ నాటికి మొత్తం ఓటర్లు 15,39,460 కాగా, వీరిలో 7,46,071 మంది పురుష ఓటర్లు, 7,93,332 మంది మహిళా ఓటర్లు, 57 మంది ఇతర ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. పోలింగ్ విధుల్లో ఉన్న ఉద్యోగులతోపాటు సర్వీస్ ఓటర్లు, 85 సంవత్సరాలకు పైబడిన, దివ్యాంగ ఓటర్లు, ఎసెన్షియల్ సర్వీస్ కింద గుర్తించిన వివిధ శాఖల ఉద్యోగులకు కేంద్ర ఎన్నికలసంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందన్నారు. వీరి నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో పోస్టల్ ఓటింగ్‌కు ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఓటు ఏ నియోజకవర్గంలో ఉందో అక్కడే పోస్టల్ ఓటింగ్ వినియోగించుకోవాలని తెలిపారు. ఇంటి వద్దనే ఓటింగ్ కొరకు బృందాలను నియమించామని, మే నెల2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఈ బృందాలు ఇంటింటికీ వెళ్లి హోం ఓటింగ్ నిర్వహిస్తాయని, ఇంకా ఎవరైనా హోం ఓటింగ్ వినియోగించుకోని వారుంటే మే 9, 10 తేదీల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ, ఎన్నికలలో శాంతి భద్రతల ఏర్పాట్లు వివరించారు. ఇప్పటి వరకు రూ.10.50కోట్ల వరకు నగదు మద్యం ప్రలోభాలకు సంబంధించి వస్తువులను సీజ్ చేసినట్టు తెలిపారు. సమావేశంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు జాన్ కింగ్స్ లే, నరహరి సింగ్ బంగేర్, వ్యయ పరిశీలకులు మనీష్‌కుమార్ చావ్ల, చవాన్ ప్రవీణ్ మోహన్‌దాస్, వికాస్ చంద్ర కరోల్, పోలీస్ పరిశీలకులు ప్రసాద్ ప్రలాద్ అక్కనోరు, డిఆర్వో కె.చంద్రశేఖరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

కలిసొచ్చే కాలం..



కర్నూలు జిల్లా నందికొట్కూర్‌లో చంద్రబాబును కలిసిన ముద్దరబోయిన

సొంతగూటికి ముద్దరబోయిన

▸▸ గన్నవరం, గుడివాడలో పనిచేయాలని అధినేత ఆదేశం

▸▸ ముద్దరబోయిన బాధ్యత తనదని స్పష్టం చేసిన చంద్రబాబు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/నూజివీడు): ఉమ్మడి కృష్ణాజిల్లాలో టీడీపీకి కాలం కలిసి వస్తోంది. నూజివీడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు టీడీపీ అధినేత బుజ్జగింపుతో సోమవారం నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. అనంతరం కర్నూలు జిల్లా నందికొట్కూర్‌లో ఉన్న చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ముద్దరబోయినను గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో తిరిగి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని చంద్రబాబు సూచించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముద్దరబోయిన బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. నూజివీడు, గన్నవరం, గుడివాడ, మైలవరం, కనిగిరినియోజకవర్గాల్లో ముద్దరబోయిన సేవలను వినియోగించుకోవాలని పార్టీ నిర్ణయించింది.

ముద్దరబోయిన రాకతో ఆ రెండు చోట్ల ఊపు

యాదవ సామాజికవర్గానికి ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు బీసీల్లో మంచి పట్టుంది. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల్లో ఉపయోగించుకుంటే బీసీల ఓట్లను సునాయాసంగా టీడీపీ ఖాతాలో వేసుకోవచ్చు. గతంలో ముద్దరబోయిన గన్నవరం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొంది తర్వాత కాంగ్రెస్‌పార్టీలో చేరారు. సుదీర్ఘకాలం బీసీ సంఘాల్లో జిల్లా రాష్ట్రస్థాయి పదవుల్లో పనిచేశారు. 2014లో టీడీపీలో చేరిన ముద్దరబోయినకు 2014, 2019లలో నూజివీడు టీడీపీ టికెట్ ఇచ్చినా ఆయన విజయం సాధించకపోవడంతో, 2024లో కొలుసు పార్థసారథికి నూజివీడు తెలుగుదేశం టిక్కెట్‌ను కేటాయించింది. దీంతో అలిగి ముద్దరబోయిన పార్టీని వీడారు. అయితే ముద్దరబోయినకు బీసీల్లో ఉన్న పట్టు దృష్ట్యా టీడీపీ ఆయన్ను వదులుకునేందుకు ఇష్టపడలేదు.

ముద్దరబోయిన సేవలను వినియోగించుకోవాలనే వ్యూహంతో ఆయనకు నచ్చచెప్పి మళ్లీ పార్టీలోకి తీసుకువచ్చారు. తెలుగుదేశంపార్టీకి అత్యంత కీలకమైన గన్నవరం, గుడివాడ నియోజకవర్గాలతో పాటు మైలవరం, కనిగిరి నియోజకవర్గాల్లో కూడా ఆయన సేవలు వినియోగించుకునే పార్టీ వ్యూహరచన చేస్తోంది.



రావి హరగోపాల్ నగర్‌లో ఓటర్ల స్లిప్‌ల పంపిణీలో వలంటీర్ కోటిప్రసాద్ (సర్కిల్‌లో)

ఎన్నికల విధుల్లో వలంటీర్!

పామర్రు, ఏప్రిల్ 30 : ఎన్నికల విధుల్లో వలంటీర్ల ప్రమేయం ఉండకూడదన్న ఎన్నికల సంఘం ఆదేశాలను కొందరు బేఖాతరు చేస్తున్నారు. ఎన్నికల సంఘం ద్వారా ఓటర్లకు స్లిప్‌ల పంపిణీలో బీఎల్వోకు సహాయకుడిగా అధికార పార్టీకి చెందిన ఓ వలంటీర్ ప్రమేయంపై సీ-విజిల్ యాప్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి కె.శ్రీలక్ష్మి బృందం పట్టణంలోని రావిహరగోపాల్‌నగర్‌లో 165 నెంబరు పోలింగ్‌స్టేషన్‌కు సంబంధించి ఓటర్లకు అందించే స్లిప్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బీఎల్వో శావరాజు వలంటీర్ సూదులగంటి కోటిప్రసాద్‌ను స్లిప్‌ల పంపిణీలో భాగస్వామిని చేసినట్టు లిఖితపూర్వకంగా తెలియజేసినట్టు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఎల్వో రాజుతోపాటు వలంటీర్ కోటిప్రసాద్‌ను విధుల నుంచి తప్పించి, చర్యల నిమిత్తం ఎన్నికల అధికారికి సిఫార్సు చేసినట్టు ఎంపీడీవో ఎం.భారతి, శ్రీలక్ష్మిలు వెల్లడించారు. తనిఖీ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వలంటీర్‌కు ఇచ్చిన ఓటర్ల స్లిప్‌లు లెక్కిస్తున్న బీఎల్వో



రాజీనామా లేఖలు ఎంపీడీవోకు ఇస్తున్న వలంటీర్లు

కొనసాగుతున్న రాజీనామాలు

మోపిదేవి : మోపిదేవి మండలం గ్రామసచివాలయాల్లో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మంగళవారం నాగాయితిప్ప, మోపిదేవిలంక పంచాయతీల్లోని 15 మంది, పెదప్రోలు సచివాలయంలో 14, ఉత్తర చిరువోలులంక ఐదు, కె.కొత్తపాలెం ఐదుగురు వలంటీర్లు తమ రాజీనామా లేఖలను ఎంపిడివో కె.శ్రీనివాసరావుకు అందజేశారు. వ్యక్తిగత కారణాలతో వాలంటీర్ల విధులకు రాజీనామా చేస్తున్నట్లు లేఖలు ఎంపీడీవోకు అందజేశారు.

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండలంలో 60 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో జ్యోతి మంగళవారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామపంచాయతీలకు చెందిన వలంటీర్లు రాజీనామా పత్రాలు అందజేసినట్టు, వాటిని ఆమోదించినట్టు ఆమె తెలిపారు. రూరల్ మండలంలో ఇప్పటి వరకు 170 మందికిపైగా రాజీనామాలు చేసినట్టు ఆమె తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.3.70

బందరు డివిజన్ ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 : బందరు డివిజన్ ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడిగా బొర్రా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఏపీ ఈఈఈ యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో బొర్రా శ్రీనివాసరావు అధ్యక్షుడుగా, మేడేపల్లి నాగేశ్వరరావు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, శాంతా శ్రీనివాసరావు డివిజన్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. చిట్టూరి మస్తాన్, జి. వెంకటేశ్వరరావు ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ప్రక్రియను జోనల్ ప్రెసిడెంట్ ఆర్. సంజీవరావు, సెక్రటరీ ఎన్.శర్మ, కృష్ణా ప్రాంతీయ కార్యదర్శి జి.కమలాకరరావు తదితరులు నిర్వహించారు.


కొల్లు రవీంద్ర, బండి రామకృష్ణకు బందరులో ఘనస్వాగతం


శేరీకల్వపూడిలో గజమాలతో అభిమానుల స్వాగతం


అర్తమూరులో బాలశౌరి, కాగితకు గజమాలతో సన్మానం


కపిలేశ్వరపురంలో వర్ల కుమార్‌రాజా, రామకృష్ణ ప్రసాద్ సమక్షంలో టీడీపీలో చేరికలు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 30 : ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజల కష్టాలు తీరనున్నాయని అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. మంగళవారం మచిలీపట్నంలోని 32, 34, 36 , 45, 46, 47 డివిజన్‌లలో కొల్లు రవీంద్ర, జనసేన జిల్లా కార్యదర్శి బండి రామకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొల్లు రవీంద్రతో గజమాలలతో సత్కరించి మహిళలు మంగళహారతుల పట్టారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, పి.వి.ఫణికుమార్, ఆళ్ల మాధవ, టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధి పుప్పాల ప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, కొండా మేస్త్రీ, వెంకయ్య, పార్వతీశం, కాలేషా, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

మామ తరపున అల్లుడు ప్రచారం

గుడివాడ : గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము తరపున ఆయన అల్లుడు డాక్టర్ పిన్నమనేని ప్రతాప్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు శ్రీలక్ష్మీనగర్‌కాలనీలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. ఆయన వెంట కాలనీ నాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కాగిత, బాలశౌరిలకు అర్తమూరు ప్రజల బ్రహ్మరథం

బంటుమిల్లి : మండలంలోని కంచడం, ముంజులూరు, మణిమేశ్వరం, అర్తమూరు, సాతులూరు, చినతుమ్మిడి, పెదతుమ్మిడి, రామవరపుమోడి, మలపరాజుగూడెం, రావిగుంట, సుంకరపాలెం, బండ్లగూడెం, ఆముదాలపల్లి గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, పెడన నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ మంగళవారం రోడ్ షో నిర్వహించారు. ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, జనసేన నాయకులు పంచకర్ల సురేష్, పార్వతీ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శేరీకల్వపూడిలో వెనిగండ్ల ప్రచారం

గుడ్లవల్లేరు : కూటమి ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి, సంక్షేమ ఉంటాయని గుడివాడ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం రాత్రి గుడ్లవల్లేరు మండలం శేరికల్వపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాముకి గజమాలతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. రావి వెంకటేశ్వరరావు, కొసరాజు బాపయ్య చౌదరి, కొడాలి రామరాజు, కాటూరి కిషోర్, చలసాని శ్రీధర్, మద్దాలి రాజారావు, బండి నారాయణ, కుందేటి అంజనేయులు, యలవర్తి వెంకటేశ్వరరావు, కాటూరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాలశౌరి సమక్షంలో జనసేనలో చేరిక

గుడివాడ : మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి సమక్షంలో వైసీపీకి చెందిన కోయిలాపు రాము తన అనుచరులు 100మందితో కలిసి మంగళవారం పెద్ద కాలువ సెంటర్‌లోని రాము స్వగృహంలో బాలశౌరి చేతుల మీదగా జనసేన కండువాలు కప్పుకున్నారు. ఘంటా కుమార్, సుంకర సతీష్, వెంపల గోపాల్, మహేష్, హేమంత్, లీలాప్రసాద్, వల్లూరి సతీష్, శేఖర్, అంకెం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్ల కుమార్‌రాజా విస్తృత ప్రచారం

పమిడిముక్కల : కృష్ణాపురం, మామిళ్ళపల్లి, అగినపర్రు, పమిడిముక్కల, ఫైడికొండలపాలెం, వీరంకి , అమీనాపురం గ్రామాల్లో పామర్రు నియోజకవర్గ కూటమి అభ్యర్థి వర్ల కుమార్‌రాజా విస్తృత ప్రచారం చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసరావు, కార్య దర్శి బాబ్జి, జనసేన నాయకులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అగినపర్రు బొడ్డువాని గూడెంవద్ద పొలాల్లో రైతులు, రైతుకూలీలు కుమార్‌రాజాను ఆపి సమస్యల గోడు వినిపించారు. కపిశేశ్వరపురంలో వైసీపీకు చెందిన 20 కుటుంబాలు మంగళవారం జొన్నలగడ్డ సురే శ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. నియోజకవర్గ సమన్వయ కర్త గొట్టిపాటి రామకృష్ణప్రసాద్, అబ్బర్వా ర్ గుండు శ్రీనివాస రావు, నాదెళ్ల సుబ్రమణ్యం, జక్కాశ్రీనివాసరావు, ఆర్, శ్రీనివాసరావు తదితరులు పార్టీ కండువాలువేసి స్వాగతం పలికారు.

వర్ల చైతన్య ప్రచారం

పామర్రు : గాడితప్పిన రాష్ట్రం తిరిగి ప్రగతిపథంలో నడవాలంటే ప్రజలు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని కుమార్‌రాజా సోదరుడు వర్ల చైతన్య అన్నారు. శ్యామలాపురంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, సుబ్రమణ్యం, మంతెన రామాంజనేయులు, పెద్దఅబ్బాయ్ చాట్ల రమేష్ చింతయ్య, వీరంకి మోహన్, వెంకటేశ్వరరావు, పిన్నిబోయిన శ్రీనివాసరావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు. **పెదపారుపూడి :** వెంట్రప్రగడ గ్రామంలో వర్ల కుమార్ రాజా, బాలశౌరి గెలుపు కోసం మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ చౌదరి ప్రచారం చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య చౌ దరి, గొరిపర్తి రవికుమార్, చదలవాడ రాధా, షేక్ బాబు, కూచిపూడి బాలకృష్ణ, వెంట్రప్రగడ రవి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

అవనిగడ్డ : జనసేన నేతలు మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్‌నేతృత్వంలో పట్టణ అధ్యక్షుడు రాజనాల వీరబాబు, మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషబాబు, తెలుగు మహిళా నాయకురాలు యాసం లంకమ్మ తదితరులు అవనిగడ్డలో ఇంటింటికి తిరుగుతూ వల్లభనేని బాలశౌరి, బుద్ధప్రసాద్‌లను గెలిపించాలని కోరారు. **ఘంటసాల :** మండలి బుద్ధప్రసాద్ కుమార్తెలు అవనిజ, కృష్ణప్రభ చిట్టూర్పు గ్రామంలో కూటమి నాయకులతో కలసి వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తుమ్మల వరలక్ష్మి, తుమ్మల చౌదరిబాబు, పరుచూరి సుభాష్ చంద్రబోస్, గుత్తికొండ వరప్రసాద్, పరిశె చలపతి, దిరిశం వెంకట్రావు, బొల్లా కిషోర్, పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గుడివాక శేషుబాబు, మండల టీడీపీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు మోదుమూడిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కనకదుర్గమ్మ దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు విశ్వనాథపల్లి పావ, బచ్చు రఘునాథ్, జనసేన నాయకులు బచ్చు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. **నాగాయలంక :** మండలి బుద్ధప్రసాద్ కోడలు సాయి సుప్రియ పర్రచివర పంచాయతీలోని మెరకపాలెంలో ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి బాపిరెడ్డి, స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు. తిప్పపాలెం, రాజేశ్వరి కాలనీలో తలశిల స్వర్ణలత, మండవ బాలవర్ధిరావు, ఉప్పల ప్రసాద్, లకనం నాగాంజనేయులు, బండ్రెడ్డి మల్లిఖార్జునరావుపాటు కూటమి నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గుల్లలమోద, పెదకమ్మవారిపాలెం, పెదగొడపాలెం, పెదపాలెం, తలగడదీవి, దిండి, సొర్లగొంది మర్రిపాలెం, రేమాలవారిపాలెం, భావదేవరపల్లి, కమ్మనమోదు, సంగమేశ్వరం గ్రామాల్లో రాష్ట్ర యానాది మహానాడు నేత నక్కా విజయబాబు , జిల్లా అధ్యక్షుడు మంగళగిరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కోనేటి సుబ్బారావు, గంధం రామచంద్రరావు, నంబూరి శివాజీలతో కలిసి పర్యటించారు. మండలి ఉదయభాస్కర్, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, సబ్బినేని అబ్బాయి పాల్గొన్నారు. **మోపిదేవి :** కోసూరువారిపాలెం గ్రామంలో మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, మత్తి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, రావి రత్నగిరి, గోబిరెడ్డి సాంబశివరావు, దిడ్ల జానకి రాంబాబు, దొప్పలపూడి జగదీష్, కోసూరు శివాజీ, గంగాభవాని, రావి దుర్గావాణి తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో రంగనాథ్‌బాబు, మూల్పూరి

ప్రవాస భారతీయుల ప్రచారం

ఘంటసాల : కూటమి అభ్యర్థుల విజయం కాంక్షిస్తూ ప్రవాస భారతీయులు ఘంటసాలలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఘంటసాల గ్రామంలోని తూర్పు బజారు, ముస్లిం బజారు తదితర ప్రాంతాల్లో ఎన్ఆర్ఐ గొర్రెపాటి రంగనాథ్ బాబు, ప్రొఫెసర్ మూల్పూరి వెంకట్రావు ఇంటింటికి తిరిగి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌లను గెలిపించాలని కోరారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, టీడీపీ నాయకులు బండి పరాత్పర రావు, గొర్రెపాటి శ్రీనివాస్, కాకుమాని రంగారావు, గొర్రెపాటి సురేష్, గొర్రెపాటి స్వరాజ్య లక్ష్మి, దిరిశం సుబ్బారావు, దిరిశం సుదర్శన్, మూల్పూరి భిక్షం, పొట్లూరి యోహాను, కిషోర్, ప్రమోద్ పాల్గొన్నారు.


కోసూరువారిపాలెంలో మండలి వెంకట్రామ్ ప్రచారం


చల్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న సాయిసుప్రియ

చల్లపల్లిలో బుద్ధప్రసాద్ కోడలు, కుమార్తె ప్రచారం

చల్లపల్లి : జనసేన అభ్యర్థులు వల్లభనేని బాలశౌరి, మం డలి బుద్ధప్రసాద్ విజయం కోరుతూ మండలి బుద్ధప్రసాద్ కోడలు మండలి సాయిసుప్రియ, పెద్ద కుమార్తె శీలం కృష్ణప్రభ చల్లపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. మోర్ల రాంబాబు, చోడగం విమల్‌కృష్ణ, పిండి రేవతి, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ నాని, ఎంపీటీసీ స్వప్న, నేతలు సజ్జా చలపతిరావు, బొందలపాటి వీరబాబు, నిడమానూరి దిలీప్ కుమార్, రావి చిట్టి, ఉస్మాన్ షరీఫ్, మోర్ల ప్రసాద్, షేక్ నబీ ఫోరి, మిక్కిలినేని మధు, పసుపులేటి శ్రీను, రావులపల్లి పండు, మోర్ల శివ, తోట కనక దుర్గ, గోళ్ల ప్రసాద్, ఉరిమి మణికాంత్, వేముల హరికృష్ణ, షేక్ సిలార్, కుంభా కృష్ణ పాల్గొన్నారు. నడకుదురు, పాత నడకుదురులో నాదెళ్ల వెంకట నరసయ్య, మా తంగి వేణు, కొర్రపాటి భాస్కరరావు తదితరులు ఇంటింటి ప్రచారం చేపట్టారు.



సబ్ జైలు వార్డర్ ఆత్మహత్య

అవనిగడ్డ : అవనిగడ్డ సబ్ జైలులో వార్డర్‌గా పని చేస్తున్న దాసరి నాగ శివకుమార్ వివాహం కాలేదన్న మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. అవనిగడ్డ సబ్ జైలులో వార్డర్‌గా పని చేస్తున్న దాసరి నాగ శివ కుమార్ బంధువుల అమ్మాయిని వివాహం చేసుకోవాలని భావించాడు. కొన్ని కారణాల వల్ల వివాహం జరగలేదు. అవనిగడ్డలో ఉంటున్న అద్దె ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాచుగుంటలో వివాహిత ఆత్మహత్య

నాగాయలంక : నాచుగుంట గ్రామానికి చెందిన సైకం వాణి (40) ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సైకం వాణికి 20 సంవత్సరాల క్రితం సైకం జయరాజుతో వివాహం అయింది. వారికి ఇద్దరు పిల్లలు.వివాహ సమయంలో రూ. 40 వేలు కట్నంగా ఇచ్చారు. తల్లిదండ్రులు, బంధువులు చెప్పుడు మాటలు విని భర్త జయరాజు భార్య వాణిని వేధిస్తుండడంతో తట్టుకోలేక ఆమె ఇంటిలోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు.

చికిత్సపొందుతూ యువతి మృతి

పెడన : కడుపునొప్పి తాళలేక యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆరో వార్డులో జరిగింది. జన్యావుల నాగశ్రీ సీతామహాలక్ష్మి (25)కి శనివారం విపరీతమైన కడుపునొప్పి వచ్చింది. నొప్పి భరించలేక ఆమె ఇంట్లో ఉన్న గడ్డి మందు తినేసింది. చికిత్స నిమిత్తం బంధువులు ఆమెను మచిలీపట్నం ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆమె మృతి చెందింది. ఎస్సై సూర్యశ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన ఎన్ఆర్ఐ నేత విజయకుమార్‌కు నివాళి

పెడన : బందరులో ఎన్నికల ప్రచారంలో ఆదివారం గుండెపోటుతో మృతి చెందిన జనసేన పార్టీ ఎన్ఆర్ఐ విభాగం నేత కటకం విజయకుమార్ (38) భౌతికకాయానికి స్వగ్రామం కవిపురంలో మంగళవారం అంత్యక్రియలు జరిగాయి. కవిపురం గ్రామానికి చెందిన విజయకుమార్ అమెరికా నుంచి ఇండియా వచ్చి జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ విజయం కోసం కృషి చేస్తు న్నారు. పవన్‌కళ్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురంతో పాటు జనసేన పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్న ఇతర నియోజకవర్గాలలో కూడా ఆయన ప్రచారం చేస్తున్నారు. విజయకుమార్ మృతికి పెడన జనసేన పార్టీ నాయకులు వరుదు రామకృష్ణ, కూనపరెడ్డి రంగయ్య నాయుడు, మట్టా శివపావని, పత్తిపాటి జయకృష్ణలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.


డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

ప్రసాద్ సేవలు అభినందనీయం : కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సేవ చేసే విషయంలో పరిపూర్ణంగా పని చేసిన అధికారులను ప్రజలు నిత్యం గుర్తుంచుకుంటారని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ పదవీ విరమణ కార్యక్రమం మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపు హాలులో జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని డ్వాక్రా సంఘాల్లోని సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడంలో డీఆర్‌డీఏ పీడీ అందరికీ ఆదర్శనీయంగా నిలిచారన్నారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో కే చంద్రశేఖర్, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనంద్‌కుమార్, వివిద శాఖల జిల్లా అధికారులు.పీఎస్ఆర్ ప్రసాద్ దుశ్శాలువాలతో సత్కరించారు.

మస్తర్లు సరిగా నమోదు కావడం లేదని కోడూరులో ఉపాధి కూలీల ఆందోళన

కోడూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు మంగళవారం ఆందోళనకు దిగారు. పలు గ్రూపుల్లో పని చేసినా మస్టర్ నమోదు కావటం లేదని, మూడు వారాలపాటు పని చేసి నా ఆన్‌లైన్‌లో పని చేసినట్లు చూపించకపోవడంతో డబ్బులు కూడా పూర్తిగా రాలేదని, ఈ విషయాన్ని ఉపాధి హామీ పథకం అధికారులకు తెలియజేసినా పట్టించుకోవటం లేదని దింటిమెరక గ్రామానికి చెందిన కూలీలు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తే దుర్భాషలాడుతూ మీకు చేతనైన పని చేసుకోమని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి మస్టర్ విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థి నాగరాజు విస్తృత ప్రచారం



పెడన : నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శొంఠి నాగరాజు మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం చేశారు. అప్పారావు, ఆకురాతి జనార్ధన్, మస్తాన్, జన్యావుల లీలాకృష్ణ పాల్గొన్నారు.


సాంబశివరావు దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన సాంబశివరావు

కూచిపూడి : సబ్బినేని సాంబశివరావు ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చారని మొవ్వ ఎంఈవోలు ఎన్.శివశంకర్, కె.శ్రీలక్ష్మి అన్నారు. మొవ్వ జడ్పీ పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చేసిన సబ్బినేని సాంబశివరావు - ఝాన్సీరాణి దంపతులను ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. సాంబశివరావు సేవలను కొనియాడుతూ పామర్రు నియోజకవర్గ పరిధిలోని పలువురు ఉపాధ్యాయులు దుశ్శాలువాలు, పూలమాలలతో సాంబశివరావు దంపతులను ఘనంగా సత్కరించారు.

నిడుమోలు తాగునీటి సమస్య పరిష్కరించాలి

కూచిపూడి : నిడుమోలు, పరిసర గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని పీఏసీఎస్ అధ్యక్షుడు రామకృష్ణ మొవ్వ మండల పరిషత్ సర్వ సభ్యసమావేశంలో అధికారులను కోరారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. పద్దారాయుడు తోట ఎంపీటీసీ సభ్యురాలు తాతా స్వప్న మాట్లాడుతూ తమ గ్రామ అభివృద్ధికి మండల పరిషత్ నుంచి నిధులు కేటాయించాల్సిందిగా కోరారు. ఎండ తీవ్రత కారణంగా ఎంపీటీసీ సభ్యులు స్వల్ప సంఖ్యలో హాజరయ్యారు. ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, జడ్పీటీసీ సభ్యురాలు పార్వతీ, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు పరిశుద్ధ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర అనసూయకు శిఖరం జాతీయ అవార్డు



గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరుకు చెందిన వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సభ్యులు, హైఫై యూత్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షురాలు కొల్లిపర అనసూయ శిఖరం ఆర్ట్ థియేటర్స్ జాతీయ అవార్డును అందుకున్నారు. గత 25 సంవత్సరాలుగా ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు. మంగళవారం ఢిల్లీలోని ఆంధ్రా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అనసూయ దంపతులు ఈ అవార్డును అందుకున్నారు.

తాగునీరు తోడేస్తున్నారు

- చేపల చెరువుల యజమానుల ఇష్టారాజ్యం
- 15 గ్రామాలకు చేరని కాల్వల నీరు

నందివాడ (పోలుకొండ) : తాగునీటి చెరువులు నింపే నిమిత్తం కాల్వలకు నీరు వదిలినప్పటికీ నందివాడ మండలంలోని 15 గ్రామాలకు ఇంకనూ తాగునీరు అందడం లేదు. చంద్రయ్య కాల్వ, దోసపాడు కాల్వలు వ్యర్థాలతో నిండిపోవడంతో తాగునీరు దిగువకు రావడం లేదు. కొద్దిపాటి నీరు వచ్చినా మురుగు నీరువస్తోంది. దానికి తోడు దోసపాడు కాల్వకు వచ్చిన నీటిని చేపల చెరువుల వారు ఇంజన్లు పెట్టి యథేచ్ఛగా తోడేయడంతో తాగునీటి చెరువులకు నీరు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. చంద్ర య్య కాల్వ ద్వారా సుమారు 15 గ్రామాలకు తాగునీరు సరఫరా కావాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో చంద్రయ్య కాల్వ ద్వారా ఇంగిలింపాక, ఉనికిలి, రుద్రపాక, పెనుమాకలంక


చంద్రయ్య కాల్వలో కలుషిత నీరు

గ్రామాల తాగునీటి చెరువులకు నీళ్ల రావడం లేదు. నామమాత్రంగా తాగునీరు రావటంతో చంద్రయ్య కాల్వ వద్దనే మోటార్లు బిగించి తోడుకునే పరిస్థితి. దోసపాడు కాల్వకు వస్తున్న నీటిని చేపల చెరువుల వారు తోడేస్తున్నారు. దోసపాడు కాల్వ ద్వారా నీరు నందివాడకు వచ్చి నాలు గు రోజులు అయినా ఇంత వరకు శివారు గ్రామాలకు తాగునీరు అందడం లేదు. పంచాయతీ కార్యదర్శులు నానా అవస్థలు పడుతున్నారు. కాల్వల గండ్లు కట్టకపోవటంతో నీళ్లన్ని చేపల చెరువులకే వాడేస్తున్నారు. రాత్రి సమయంలో యథేచ్ఛగా చేపల చెరువులకు పెట్టేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించటంతో చేపల చెరువుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మండవల్లి ఎంపీడీవో బేబి లక్ష్మి సిబ్బందితో పోలుకొండ, చంద్రయ్య కాల్వను పరిశీలించి ఇంజన్లు బిగించి కింది గ్రామాలకు తాగునీరు అందే విధంగా చర్య లు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూ చించారు. ఇప్పటికైనా నందివాడ, చంద్రయ్య, దోసపాడు కాల్వల నీరు పంచాయతీ చెరువులకు అం దేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.